
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

శనివారం 11 జనవరి 2025 5





ముక్కోటినీ మొక్కారు!





శేష శైల వాసా : (వరుసగా) ఆదిశేషువుపై భక్తులకు దర్శనమిచ్చిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి, శేషపాన్పుపై అమ్మవారితో దర్శనమిచ్చిన అన్నవరం సత్యనారాయణస్వామి .. ప్రత్యేక అలంకరణలో అప్పనపల్లి బాలబాలాజీ

ముక్కోటి దేవతలతో తరలివచ్చిన శ్రీమహా విష్ణువును జనకోటి మొక్కింది.. గోవిందా.. గోవింద.. నమో నారాయణ అంటూ స్వామిని భక్తజనం కొలిచారు.. శేష శయనా వాసా శ్రీ వెంకటేశా అంటూ గీతాలు ఆలపించారు.. కనులారా స్వామిని తిలకించి కోర్కెలు తీర్చమని వేడుకున్నారు.. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలు కిటకిటలాడాయి.. వైష్ణవ ఆలయాలకు పెద్దఎత్తున భక్తజనం హాజరై క్యూకట్టారు.. అన్నవరం సత్యనారాయణ స్వామి, వాడపల్లి వేంకటేశ్వరస్వామి, అప్పనపల్లి బాలబాలాజీ, ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాలకు శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు. పలు ఆలయాల్లో ఉత్తరద్వారంలో వైకుంఠవాసుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.. పూలతో చేసిన అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.. ఆలయాల వద్ద భారీ ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఆలయ పాలకవర్గాలు చర్యలు చేపట్టాయి.. - 6లో

పద్ధతి మార్చుకోకుంటే.. నే రోడ్డెక్కుతా!



పవన్‌కు బొట్టు పెడుతున్న ఓ మహిళ

కుర్రకారు..పోలీసుల తీరుపై పవనాగ్రహం

- మీకు నిద్రాహారాలు ఉండవు
- ఈవ్‌టీజింగ్ చేస్తే తొక్కినారతీస్తా
- గంజాయి బ్యాచ్ ఆగడాలు పెరిగాయి
- పోలీసుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి
- ఇక నుంచి నెలకు 14 రోజులు ఇక్కడే
- పిఠాపురం నుంచే రాష్ట్రవ్యాప్త యాత్ర
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఈవ్‌టీజింగ్ అంటే నాకు చిరాకు. పద్ధతి మార్చుకోకుంటే తొక్కి నారతీస్తా. నేను గనుక రోడ్డు మీదకు వస్తే ఎవరికీ నిద్రాహారాలు ఉండవు. గంజాయి బ్యాచ్ ఆగడాలు ఎక్కువయ్యాయి. రాత్రివేళల్లో బైక్‌లపై విన్యాసాలు చేస్తున్నారు. చోరీలు అధికమయ్యాయి. పిఠాపురంలో పోలీసులు ఉదాశీనంగా ఉంటున్నారనే ఫిర్యాదులు అధికమయ్యాయి అంటూ పోలీసుశాఖ పనితీరుపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాతబస్టాండు వద్ద గల మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పిఠాపురానికి జాతీయస్థాయిలో పేరు తీసుకురావాలని ఉందని తెలిపారు. అదే సమయంలో పిఠాపురం నుంచి పలు ఫిర్యాదులు వచ్చాయని చెబుతూ ఫోన్ చూస్తూ పోలీసులపై వచ్చిన కొన్ని ఫిర్యాదులను చదివి వినిపించారు. కొద్దిరోజుల కిందట పిఠాపురంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లోకి రాత్రి పూట ఇద్దరు వ్యక్తులు వచ్చి అక్కడ విద్యార్థులను బెదిరించి వారి వద్ద ఉన్న కొద్దిపాటి డబ్బులు లాక్కుని పరారయ్యారని తెలిపారు. మెయిన్‌రోడ్డులో కత్తి చూపించి బెదిరించి బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారని.. ఇటువంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయని తెలిపారు. ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద కొందరు యువకులు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్నారని, ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ కేశవరావు పోలీసుల దృష్టికి తీసుకొచ్చినట్టు చెప్పారు. అయినా తగ్గకపోగా ఈవ్‌టీజింగ్ పెరిగిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆడపిల్లలను ఏడిపిస్తే మగతనం కాదనే విషయాన్ని యువకులు తెలుసుకోవాలని, మగతనం కావాలంటే సైన్యంలో చేరాలని హితవు పలికారు.తన నియోజకవర్గంలో ఈవ్‌టీజింగ్ అనే మాట ఇక వినపడకూడదని, ఆడపిల్లలను ఏడిపిస్తే తొక్కి నారతీస్తానని హెచ్చరించారు. పోలీసుస్టేషన్లలో లాయర్లు సెటిల్‌మెంట్లు చేయకూడదని పోలీసులకు హితవు పలికారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఏ అధికారిని నేను రికమెండ్ చేయలేదు. సుపరిపాలన ఇవ్వండి అని కోరానని తెలిపారు. అది జరగకపోతే నాలాంటి వారు వచ్చి రోడ్డు మీద తిరిగితే ఎవ్వరికి నిద్రాహారాలు ఉండవని హెచ్చరించారు. ఆయన వెంట కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ కార్యదర్శి శశిభూషణ్, కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన, టీజేపీ ఇన్‌చార్జిలు మర్రెడ్డి శ్రీనివాసరావు, బుర్రా కృష్ణంరాజు,కుడా చైర్మన్ తుమ్మల బాబు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్ వార్డు కౌన్సిలర్ నల్లా రమణమ్మ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ డైరెక్టర్ కృష్ణతేజ తదితరులు ఉన్నారు.

పిఠాపురం నుంచి యాత్ర ప్రారంభిస్తా..

స్టార్‌డమ్ వదులుకుని ఒకటిన్నర దశాబ్దంగా నలిగిపోయా.. ఆటుపోట్లు ఎదుర్కొన్నా.. ఎన్నో ఎదురు దెబ్బలు తగిలాయి.. ఆ గాయాలకు పిఠాపురం ప్రజలు మందు పోశారని పవన్ తెలిపారు. మీరు చుక్కనీరు దొరక్క దాహంతో అలమటిస్తున్న వ్యక్తికి నీరందిస్తే ఎలా ఉంటుందో గెలుపు ద్వారా రుచి చూపించారు. 26 జిల్లాలు తిరగాలని అనుకున్నా. అయితే ఇంటిని శుభ్రం చేసిన తర్వాత రాష్ట్రం సంగతి చూద్దామని భావించి పిఠాపురం నుంచే తన యాత్ర మొదలు పెట్టాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. తాను కొన్న స్థలంలోనే షెడ్లు వేసుకుని నెలలో 14 రోజులు ఇక్కడే ఉండి 54 గ్రామాలు వెళ్లి అందరినీ కలుస్తానన్నారు. ముందుగా ఉప్పాడ మత్స్యకార గ్రామాల నుంచి మొదలుపెడతానని పవన్ చెప్పారు.

50 నిమిషాలు స్టాల్స్ దగ్గరే..



చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న పవన్.. చీరల స్టాల్ పరిశీలన.. బుక్ చదువుతున్న పవన్

పిఠాపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పవన్ రాకతో పిఠాపురంలో ముందుగానే సంక్రాంతి వచ్చేసింది. పిఠాపురం పాతబస్టాండు మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను ఆసక్తిగా తిలకించారు. హరిదాసు కీర్తనలు.. పిట్టదొరల కోతలు, మాటలు వింటూ, జంగమదేవర జోస్యాన్ని ఆసక్తిగా ఆలకించారు. మహిళతో సోది చెప్పించుకున్నారు. రథాలపేట అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులతో సరదాగా ముచ్చటించి భోగిపండ్లు వేశారు. గర్భిణులు కె.వరలక్ష్మి, ఏ.రమ్యలకు సీమంతం నిర్వహించి ఆశీస్సులు అందించారు. చేనేత జౌళిశాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో నేత, పట్టు చీరలు, జాంధాని చీరలను తిలకించి ప్రత్యేకంగా ఆరా తీశారు. గ్రంథాలయ సంస్థ పుస్తక ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. సుమారు 50 నిమిషాలకుపైగా స్టాల్స్ వద్ద గడిపారు. కుమారపురంలో ఉపాధిహామీ పథకం కింద రూ.1.85 లక్షలతో నిర్మించిన మినీగోకులాన్ని ప్రారంభించారు.నాలుగు గోవులను రైతు యాతం నాగేశ్వరరావుకు అందజేశారు. ఇక్కడ నుంచే రాష్ట్రంలో 12,500 గోకులాలకు ప్రారంభోత్సవం చేశారు.



పవన్‌కు బొకే ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, సభలో అతిథులు





మేమంతా మీ వెంటే: పవన్ సభకు హాజరైన జనం

కోళ్లు... కాళ్లు దువ్వేస్తున్నాయ్!



కోడిపందాలకు రంగం సిద్ధం
బరుల నిర్వహణకు పాటలు

ముమ్మిడివరం, జనవరి10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సమీపించడంతో కోడిపందాల నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గత ఐదేళ్లగా పందాలకు దూరంగా ఉన్న టీడీపీ నాయకులు కోడిపందాల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకుని వాటికి ఏర్పాట్లకు సంబంధించి ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. సంక్రాంతి పండుగ సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని, జిల్లా కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్‌లు పదేపదే సూచిస్తున్నా నిర్వాహకులు మాత్రం ఆ హెచ్చరికలు పట్టించుకోకుండా పందాల నిర్వహణకు సంసిద్ధమవుతున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని మురమళ్లలో భారీఎత్తున కోడి పందాల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పందెంరాయుళ్లు, పందాలు వీక్షించేందుకు వచ్చేవారు ఇప్పటికే పలు ప్రైవేటు కాటేజీలను బుక్ చేసుకున్నారు. పండుగ మూడు రోజులు బస చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మురమళ్లలోను, ముమ్మిడివరం మండలం కొమానపల్లిలో ఉన్న ప్రైవేటు గెస్ట్ హౌస్‌లు ఇప్పటికే బుక్ అయ్యాయి. కాట్రేనికోన మండలం చెయ్యేరు, గెద్దనాపల్లిలోని, ముమ్మిడివరం మండలంలోని రాజుపాలెం, కొత్తలంక, అన్నంపల్లి, గేదెల్లంక, అయినాపురం తదితర గ్రామాల్లో కోడిపందాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. రాజుపాలెంలో కోడిపందాల నిర్వహణకు సంబంధించి బరి నిర్వాహకుడు బీజేపీ మండలస్థాయి నాయకుడు. రూ.9.50 లక్షలకు నిర్వాహకుల వద్ద పాడుకున్నట్టు సమాచారం. ఈ రూ.9.50 లక్షల్లో కొంత గ్రామంలోని దేవాలయాలకు, పోలీసు, రెవెన్యూ, మీడియాకు ఇంతని కేటాయించినట్టు సమాచారం. మూడు రోజులపాటు కోడిపందాలు, పేకాట, మద్యం, బిర్యానీ, పకోడీ స్టాల్స్ వంటివి ఏర్పాటుచేసేందుకు బరుల వద్ద ఒక్కొక్క దానికి ఒక్కో రేటు నిర్ణయించి వారికి కేటాయిస్తున్నారు. ఈ ఏడాది పండుగ మూడు రోజులు కోడిపందాలు, గుండాట, పేకాట వంటికి జోరుగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. పందాల నిర్వహదారుల నుంచి బరుల నిర్వాహకులు కోడిపందాలు, పేకాట, బిర్యానీ, మాంసం పకోడి వంటి స్టాల్స్ ఏర్పాటుకు పాట పాడుకుని వాటిని ఏర్పాటుచేసే పనుల్లో నిమగ్నమయ్యారు. అధికారులు కోడిపందాలు, జూదాలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించినా నిర్వాహకులు వాటిని పట్టించుకోకుండా తమ ఏర్పాట్లలో మునిగారు.



అల్లవరం మండలం కోడూరుపాడు పరిధిలో సంక్రాంతి కోడిపందాలకు సిద్ధమైన ఓ పందెం బరి

ముక్కోటి ముహూర్తం.. ట్రయల్ పందెంతో శ్రీకారం

అల్లవరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందాలకు పందెం బరులు సిద్ధమయ్యాయి. పోలీసుల హెచ్చరికలు, కోర్టు ఆంక్షల ఉన్నప్పటికీ అల్లవరం మండలంలోని పలు గ్రామాల్లో కోడిపందాలకు తగ్గేదే లే అంటూ పందాల నిర్వాహకులు రంగం సిద్ధంచేశారు. ఇప్పటికే బరుల ఏర్పాటులో బిజీగా ఉన్న వీరంతా ముక్కోటికి ముహూర్తం అంటూ కొన్నిచోట్ల ట్రయల్ పందాలు వేయడం విశేషం. ఏకాదశి మంచి ముహూర్తంగా ఉంటుందని, పందాలకు ఏ ఆటంకాలు రాకూడదని కోరుకుంటూ ట్రయల్ (కత్తులు లేకుండా డింకీ పందెం) పందాలు వేసినట్టు సమాచారం. అల్లవరం మండలంలోని అల్లవరం సడక్ రోడ్డు, గుడ్డివానిచింత, కోడూరుపాడు, ఆకులవారిపేట, తూర్పులంక, గోడి, రెల్లుగడ్డ, కొమరగిరిపట్నం, గుండెపూడి, దేవగుప్తంతో సహా పదకొండు చోట్ల కోడిపందాలకు సై అంటూ పందెంబరులు సిద్ధమయ్యాయి. షామియానాలు కట్టి ఫ్లడ్ లైట్ల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కోర్టు ఆంక్షలు, పోలీసుల హెచ్చరికల నేపథ్యంలో రాజకీయ సిఫారసు అండతో కోడి పందాలు సజావుగా సాగే ఏర్పాట్లు చకచకా జరిగిపోయాయి. పందాలను చూసేందుకు వచ్చే వాహనదారుల వాహనాలకు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మాంసం అమ్మకాలకు ప్రత్యేక స్థలాలు కేటాయించారు. గుండాటలు జరుగుతాయా లేదా అన్నది తేలాల్సివున్నా ఆదాయం ఇచ్చేవి అవే. వీటికి వేలం పాటలూ మొదలైనట్టు తెలిసింది.

దివ్యాంగుల మోముల్లో సంక్రాంతి కాంతులు

- అనాథాశ్రమ పిల్లలకు ప్రైవేట్ మాల్‌లో స్వయంగా దుస్తులు కొనుగోలు చేసిన మంత్రి సుభాష్

45 మందికి డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతి

6

- సీనియర్ అసిస్టెంట్‌లకు అవకాశం
- అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 12 మందికి చాన్స్



సంక్రాంతి సంబరాల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

కలెక్టరేట్‌లో సంక్రాంతి సంబరాలు

అమలాపురం టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సనాతన సంస్కృతి సంప్రదాయాల కలయికే తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి అని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. సంక్రాంతి పండుగలో ఎంతో వైజ్ఞానికత ముడిపడి ఉందని వివరించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం ముందస్తు సంకాంత్రి సంబరాలను ఉద్యోగులతో వైభవంగా నిర్వహించారు. భోగిమంటలు వేసి రంగవల్లులు, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోనసీమ జిల్లా ప్రజలందరికీ తొలుత సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలన్నారు. కలెక్టరేట్‌లో సంక్రాంతి శోభను తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేసిన పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావును జేసీ అభినందించారు. వివిధ పోటీల్లో విజేతలకు జిల్లా కలెక్టర్ బహుమతులు అందజేశారు.

భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో రైల్వే లైన్ నిర్మాణ పనులు ప్రారంభించాలి : జిల్లా కలెక్టర్

అమలాపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్‌లో భాగంగా భూసేకరణ పూర్తి అయిన ప్రాంతాల్లో రైల్వేలైన్ నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ రైల్వేశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కోనసీమ రైల్వేలైన్‌కు సంబంధించి రైల్వేలైన్ నిర్మాణ పనుల పురోగతిపై రెవెన్యూ, రైల్వేశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే లైన్‌లో భాగంగా భూసేకరణ పూర్తి అయిన ప్రాంతాల్లోని భూమిని రైల్వే అధికారులు స్వాధీనం చేసుకుని నిర్మాణ పనులను ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అయినవిల్లి మండలంలోని శానపల్లిలంక, సిరిపల్లి, మాగాం, అమలాపురం రూరల్ మండలంలోని ఎ.వేమవరం, భట్నవిల్లి గ్రామాల్లో రైల్వేలైన్‌కు సంబంధించిన భూసేకరణ పూర్తయిందన్నారు. రైల్వే అధికారులు గ్రామానికి ఒక ప్రత్యేక బృందం చొప్పున పంపించి నిర్మాణ పనులను ప్రారంభించాలని సూచించారు. సంబంధిత రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల్లో గతంలో భూ సేకరణ పూర్తి అయిన భూములను సర్వేచేసి హద్దులను గుర్తించి రైల్వే అధికారులకు తక్షణం అప్పగించాలన్నారు. సంబంధిత ప్రాంతాల్లోని రైతులు తదుపరి పంట వేసేలోపు రైల్వే అధికారులు భూసేకరణ పూర్తి అయిన భూములను తమ అధీనంలోకి తీసుకుని నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా భూసేకరణ విషయంలో కోర్టు పరిధిలో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. రైల్వేలైన్ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జేసీ టి.నిషాంతి, దక్షిణ మధ్యరైల్వే ఉప ముఖ్య ఇంజనీర్ ఎ.బద్దియ్య, కొత్తపేట, అమలాపురం, ఆర్డీవోలు పి.శ్రీకర్, కె.మాధవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్ఎస్వీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన సత్యదేవుడు

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- వెండి రథంపై విహరించిన స్వామి, అమ్మవార్లు
- తొలి దర్శనం చేసుకున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ, అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు దంపతులు


ఉత్తర ద్వారంలో సత్యదేవుడు, అమ్మవార్లను దర్శించుకుంటున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ, ఈవో సుబ్బారావు


అన్నవరంలో స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

అన్నవరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రత్నగిరివాసుడైన సత్యదేవుడు శేషతల్పంపై శయనిస్తున్న శ్రీమహావిష్ణువు గాను, దేవేరి అనంతలక్ష్మి అమ్మవారు ఆయన పాదాలను సుతిమెత్తగా ఒత్తుతున్న లక్ష్మీదేవిగా భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. సుప్రభాత సేవ, ప్రత్యేక పూజల అనంతరం ఐదు గంటలకు ఉత్తర ద్వార దర్శనం ప్రారంభించగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఈవో దంపతులు తొలి దర్శనం చేసుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన సుమారు 50వేల మంది భక్తులు దర్శించుకున్నారు. తిరుమల సంఘటన నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఈవో వీర్ల సుబ్బారావు స్వీయ పర్యవేక్షణలో క్యూలైన్లలోనే భక్తులను, స్థానికులను, ఉద్యోగుల కుటుంబసభ్యులను అనుమతించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్, ఎస్పీ పలుమార్లు ఈవోకు ఫోనులో సూచనలిచ్చారు. పుష్పాలంకరణలు, నేలపైనుంచే శేషతల్పం తూర్పు రాజగోపురం పక్కన నమూనా ఆలయం సెట్టింగ్ విశేషంగా ఆకట్టుకున్నాయి. కోలాటం, భరతనాట్యం ప్రదర్శనలు అలరించాయి. ఉదయం పదకొండు గంటలకు స్వామి, అమ్మవార్లను వెండి రథంపై ఆసీనులు గావించి తూర్పు రాజగోపురం చుట్టూ సేవ నిర్వహించగా ఈవో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. రాత్రి ఏడు గంటలకు కొండ దిగువన వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.


కోనసీమ జిల్లా అంతర్వేదిలో కొలువైయున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ముక్కోటి... భక్త కోటి

వాడపల్లిలో వైభవంగా వైకుంఠ ఏకాదశి


వెంకటేశ్వరస్వామిని ఉత్తర ద్వారంలో దర్శించుకుంటున్న మంత్రి సుభాష్ (పైన) కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జి శ్రీనివాసరావు (కింద)



ఆత్రేయపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ముక్కోటి ఏకాదశినాడు భక్తులతో శోభిల్లింది. వేకువజామునే గోదావరి జలాలతో స్నపనమూర్తులకు అభిషేకించి జరిపి తిరుప్పావై పారాయణం నిర్వహించారు. ఉత్తరం వైపున పుష్పాలతో అలంకరించిన సప్తద్వారాల ద్వారా శేషపాన్పుపై విహరించిన స్వామివారిని భక్తులు కనులారా దర్శించుకుని తన్మయత్వం పొందారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కుటుంబ సభ్యులు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ కోనసీమ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, టీడీపీ నేతలు కరుటూరి నరసింహరావు, ముదునూరి వెంకట్రాజు, ముళ్ళపూడి భాస్కరరావు, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల గోవిందనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. స్వామివారి గరుడ వాహనంపై తిరువీధుల్లో విహరించి భక్తులకు అభయహస్తం అందించారు. వాడపల్లి క్షేత్రాన్ని ఫల, పుష్ప విద్యుత్ కాంతులతో సర్వాంగసుందరంగా అలంకరించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షిం చారు. సీఐ విద్యాసాగర్, ఎస్ఐ రాము ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు.


దర్శనానికి బారులు తీరిన భక్తులు


స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సత్యనారాయణ, జడ్పీ మాజీ చైర్మన్ నామన

అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో...

మామిడికుదురు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలంలోని అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో ఉత్తరద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. వివిధ రకాల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన మండపంలో స్వామివారు ఉభయ దేవేరులతో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గోదాదేవికి నిర్వహించిన లక్ష చామంతి పూజలో అధిక సంఖ్యలో భక్త దంపతులు కర్తలుగా పాల్గొన్నారు. మేళతాళాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్తర ద్వారంలో స్వామివారిని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, జాయింట్ కలెక్టర్ నిషాంతి దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనరు ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో కనీవిని ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేశారు.

45 మందికి డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతి

- సీనియర్ అసిస్టెంట్‌లకు అవకాశం
- కాకినాడ జిల్లాలో 10
- తూర్పుగోదావరి జిల్లాలో 10
- అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 12
- అల్లూరి జిల్లాలో 13
- ఉత్తర్వులు వెలువరించిన జిల్లా కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరిజిల్లాలో రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న 45 మంది సీనియర్ అసిస్టెంట్‌లకు డిప్యూటీ తహసీలార్లుగా పదోన్నతి పొందారు. ఈమేరకు శుక్రవారం ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి, కాకినాడజిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఉత్తర్వులు వెలువరించారు. కాకినాడ జిల్లాకు 10, తూర్పుగోదావరి జిల్లాకు 10, అంబేద్కర్ కోనసీమ జిల్లాకు 12, అల్లూరి సీతారామరాజు జిల్లాకు 13 మంది డిప్యూటీ తహసీల్దార్లను కేటాయించారు. సంక్రాంతి నేపథ్యంలో వరుసగా ఐదురోజుల సెలవులు రావడంతో ఈనెల 16వ తేదీ నుంచి వీరు విధుల్లోకి చేరే అవకాశంఉంది. ఖాళీగా ఉన్న డిప్యూటీ తహ సీల్దార్ల పోస్టులు భర్తీ చేయడంతో ఉద్యోగులు హర్షంవ్యక్తం చేశారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

పెద్దాపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నవోదయ ఆరవ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 18న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశామని, 8971 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30వరకూ పరీక్ష నిర్వహిస్తామని, ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాల న్నారు. ఆన్‌లైన్‌లో తమ హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. సమా చారం కోసం 9441008830, 9440419142లో సంప్రదించాలని కోరారు.

16న ఐటీఐ అప్రెంటీస్‌షిప్ మేళా

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 16వ తేదీ ఉదయం 9గంటలకు అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రధానాధికారి కృష్ణన్ తెలిపారు. ప్రముఖ కంపెనీల ఆధ్వర్యంలో పీఎంఎన్ఏఎంమేళా నిర్వహిస్తున్నామన్నారు. ఐటీఐ ఉత్తీర్ణులైన అన్ని ట్రేడ్ల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు.

దివ్యాంగుల మోముల్లో సంక్రాంతి కాంతులు

- అనాధాశ్రమ పిల్లలకు ప్రైవేట్ మాల్‌లో దుస్తులు కొనుగోలు చేసిన మంత్రి సుభాష్
- స్వయంగా వెళ్లి వారితో కలిసి షాపింగ్


దివ్యాంగులతో కలిసి దుస్తులు కొనుగోలు చేస్తున్న మంత్రి సుభాష్


రామచంద్రపురంలో రిలయన్స్ ట్రెండ్స్‌వద్ద దివ్యాంగులతో మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వారంతా దివ్యాంగులు.. మనోవైకల్యం, అంధత్వం, బధిరులు, శారీరక వైకల్యం ఇలా వైకల్యంతో జీవితం గడుపుతున్న బాలబాలికలు, యువతీ యువకులు.. కొంతమంది అనాథలు, మరికొంతమంది తల్లి లేదా తండ్రి మాత్రమే ఉన్నవాళ్లు. వీరంతా డాక్టర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా రామచంద్రపురం పట్టణంలో జోయ్ మినిస్ట్రీస్ బేతస్థ న్యూలైఫ్ సెంటర్‌లో దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలో ఆశ్రయం పొందుతున్నారు. వీరి ముఖాల్లో సంతోషం.. సంక్రాంతి పండుగ ఘడియలు సమీపిస్తున్న వేళ వీరి జీవితాల్లోను ఆనందగడియలు నింపారు మంత్రి సుభాష్.

బస్సులో రిలయన్స్ టెండ్స్‌కు..

మంత్రి సుభాష్ ఆశ్రమ పాఠశాల నిర్వాహకులకు దివ్యాంగుల పాఠశాలలో ఉన్న పిల్లలు, సిబ్బందిని రిలయన్స్ ట్రెండ్స్‌కు పంపాలని బస్సు పంపించారు. దీంతో వీరంతా టూరిస్టు బస్సు ఎక్కి బయలుదేరారు. మార్గమధ్యలో మంత్రి సుభాష్ బస్సు ఎక్కారు. మెయిన్‌రోడ్డులో ఉన్న ట్రెండ్స్‌కు చేరుకున్నారు. దివ్యాంగులతో కలిసి మంత్రి సుభాష్ రిలయన్స్ టెండ్స్ షాపింగ్‌మాల్‌లోకి ప్రవేశించారు.

నచ్చిన దుస్తులు ఎంపిక చేసుకోమని..

దివ్యాంగులు లైట్లు మిరమిట్లు గొలుపుతున్న ట్రెండ్స్‌లో ప్రవేశించి ఆశ్చర్యానికి లోనయ్యారు. మంత్రి సుభాష్ దివ్యాంగులను మీకు నచ్చిన దుస్తులు ఎంపిక చేసుకోండి అని చెప్పారు. దీంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. మంత్రి సుభాష్ వారితో కలిసి దుస్తులు ఎంపిక చేశారు. మొత్తం 65మంది పిల్లలు, 8మంది సిబ్బందికి దుస్తులు కొనిచ్చారు మంత్రి సుభాష్. రెండుగంటలపాటు దివ్యాంగులతో కలిసి మంత్రి షాపింగ్ చేయడంతో ఇటు దివ్యాంగులు, షాపింగ్‌మాల్ సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పాఠశాలలో డిగ్రీ పూర్తి చేసిన ఖండవిల్లి దుర్గాదేవికి వికాస డైరెక్టర్‌తో మాట్లాడి ఉద్యోగం ఏర్పాటు చేశారు. దివ్యాంగుల ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు అలెగ్జాండర్, ప్రిస్కిల్లా దంపతులను మంత్రి సుభాష్ అభినందించారు.

జాతీయస్థాయి ఖో ఖో పోటీలకు కరప విద్యార్థిని ఎంపిక



కరప, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కరప జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బొగిరెడ్డి పావనిశ్రీ మణిచంద్రిక జాతీయస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 10నుంచి 13వ తేదీ వరకు మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగే 69వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడల్లో పావని రాష్ట్రజట్టు తరపున ప్రాతినిధ్యం వహించనుందన్నారు. తన మెరుగైన ఆటతీరుతో ఆంధ్రప్రదేశ్ జట్టులో స్థానం దక్కించుకున్న పావనిశ్రీను, తర్ఫీదునిచ్చిన పాఠశాల పీడీలు కె.శ్రీనివాసరావు, బి.చంద్రశేఖర్‌లను హెచ్ఎంతో బాటు ఎస్ఎంసీ చైర్మన్ దేవు దుర్గారావు, ఉపాధ్యాయులు మారిశెట్టి రమేష్, బి.స్వర్ణరాణి, టేకుమూడి శ్రీనివాస్, పి.సరోజ, కేఎస్ఎన్ మూర్తి, తదితరులు అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో చక్కటి ప్రతిభచూపాలని ఆకాంక్షించారు.

సతీష్‌బాబును కలిసిన క్రికెటర్ నితీష్ కుమార్‌రెడ్డి


సతీష్‌బాబును కలిసి మొక్క అందజేస్తున్న క్రికెటర్ నితీష్ కుమార్‌రెడ్డి

కాకినాడసిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలో జరిగిన అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో ప్రతిభ కనబరిచిన విశాఖపట్నంనకు చెందిన క్రికెట్ క్రీడాకారుడు నితీష్ కుమార్ రెడ్డి శుక్రవారం విశాఖలోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు, ఏసీఏ గౌరవ కార్యదర్శి సానా సతీష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా సతీష్‌బాబు నితీష్ కుమార్ రెడ్డిని అభినందించి ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలి

- స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్‌కు సీఆర్ఎంటీల వినతి

ప్రత్తిపాడు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న సీఆర్ఎంటీలకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీసీఆర్పీడబ్ల్యుఎ రాష్ట్ర నేతలు స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ ఎస్.అబ్రహంకు విజ్ఞప్తి చేశారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడుకు చెందిన ఏపీసీఆర్పీడబ్ల్యుఎ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిపే రాంజీ ప్రసాద్ బృందం శుక్రవారం విజయవాడ విద్యా భవన్‌లో అబ్రహంను కలిసి వినతిపత్రం అందజేసింది. ఐదేళ్లుగా జీతాల పెంపుదల లేక సీఆర్ఎంటీలు ఇబ్బందిపడుతున్నారని రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు వివరించారు.


జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్, అతిథులు

గణిత వ్యూహాలపై ఓరియంటేషన్

- ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్

జేఎన్టీయూకే, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వర్శిటీ అలూమ్ని ఆడిటోరియంలో గణిత ఉపాధ్యాయులకు కాకినాడజిల్లా పాఠశాల విద్యాశాఖ, ఏపీ మ్యాథ్స్‌ఫోరం(ఏపీఎంఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో గణిత వ్యూహాలపై ఓరియంటేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏపీ మ్యాథ్స్‌ఫోరం జిల్లా అధ్యక్షుడు కె.జోగిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ ముఖ్యఅతిథిగానూ, డీఈవో పి.రమేష్, ఎస్ఎస్ఏ సీఎంవో సీహెచ్ నాగేశ్వరరావు, డీవైఈవో వెంకటేశ్వరరావు, ఏపీఎంఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మూర్తి, సలహాదారులు మల్లికార్జున గణితావధాని టి.సాయిరామకృష్ణ, రవిశంకర్ అతిథులుగా పాల్గొన్నారు. రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతీవిద్యార్థికి మొదటి గురువు గణిత ఉపాధ్యాయుడేనన్నారు. స్టెమ్‌కోర్సులలో గణితం కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. పదో తరగతిలో విద్యార్థులు గణితంలో నూరుశాతం మార్కులు సాధించేందుకు అవలంబించాల్సిన అంశాలను రీసోర్స్ పర్సన్లు ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

సంక్రాంతి విశిష్టతను భావితరాలకు అందించాలి

- ఏపీఎస్పీలో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న కమాండెంట్ దీపిక


మట్టి కుండపై పరమాన్నం తయారు చేస్తున్న కమాండెంట్ దీపిక


హరిదాసు శ్రీరామ కీర్తనలు వింటున్న కమాండెంట్ దీపిక

సర్పవరం జంక్షన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నేటి తరానికి తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేసే విధంగా సంక్రాంతి పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.దీపిక అన్నారు. శుక్రవారం రమణయ్యపేట ఏపీఎస్పీ ఇంగ్లీషు మీడియం స్కూల్లో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంక్రాంతి పండుగ ఉట్టిపడేలా భోగిమంటలు, గొబ్బెమ్మలు, రంగవల్లులు, హరిదాసు, గోదాదేవి, కృష్ణుడు, సోదమ్మ, బుడబుక్కలోడు, కొమ్మదాసరుడు వంటి వేషధారణలతో విద్యార్థులు అలరించారు. నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఆంధ్ర పేపరు మిల్లులో
ఏం జరుగుతోంది?

- మనుగడకు ముప్పు వాటిల్లే ఘంటికలు
- కార్మిక క్షేమం పట్టని ఈడీ ముఖేష్ జైన్
- వేతన ఒప్పందాలు లేకుండా వ్యవహారం
- పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం
- పరంపర-2 పేరుతో ఉద్యోగాల అమ్మకాలు
- పెచ్చుమీరిన దాష్టీకాలు
- మహిళా ఉద్యోగిని లోబర్చుకుని మోసం
- ఇటీవల పేపర్‌మిల్లు లాకౌట్.. ఆరోజే ఎత్తివేత కూడా..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

చారిత్రక రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠాత్మకమైన ఆంధ్ర పేపరుమిల్లు లిమిటెడ్‌లో ఏం జరుగుతుందో కానీ.. దాని మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాద ఘంటికలు మోగు తున్నాయి. ఏ కంపెనీ అయినా తన అభివృద్ధితోపాటు కార్మికుల సంక్షేమం చూడాలి. ఒకపక్క మిల్లు కెపాసిటీ విస్తరిస్తూ మరోపక్క కార్మికులపట్ల యాజమాన్య కుట్రలు, యాజమాన్యం తరపున ఇక్కడ వ్యవహారాలు చక్కపెడుతున్న వారి దాష్టీకంతో మిల్లు ప్రతిష్ట దిగజారిపోతోంది. ఇటీవల పేపర్‌మిల్లుకు లాకౌట్ ప్రకటించగా కూటమి ప్రభుత్వంలోని ఎమ్మెల్యేల చొరవతో లాకౌట్ ప్రకటనను ఆరోజు సాయంత్రానికే విరమించుకున్నారు. ఈ నేపథ్యంలో లోపల ఏం జరుగుతోందో తెలుసుకుందాం..

2019 వరకు యాజమాన్యాలు మారినా కార్మికుల సంఘాలు పటిష్టంగా ఉండడంతో మిల్లుకు ఇబ్బంది కలగలేదు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేపరుమిల్లు యాజమాన్య వైఖరిలో మార్పు వచ్చింది. దాష్టీకాలు పెరిగాయి. ఉన్నతస్థానాల్లో ఉన్న తెలుగు ఉద్యోగులు 70మంది ఉద్యోగాలు వదిలేసి వెళ్లిపో యారు. వారి స్థానాలు నార్త్ ఇండియాకు చెందినవారితో నిండిపోయాయి. మూడున్నరేళ్లకోసారి జరిగే వేతన ఒప్పందానికి తూట్లు పొడవంతోపాటు, సీనియార్టీ ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగుల పదోన్నతులు ఆపేశారు. పర్మినెంట్ ఉద్యోగులను ప్రలోభ పెట్టి వారు ఉద్యోగాలు వదిలేసుకునేలా చేసి వాటిని ఏ విధమైన అనుభవం లేనివారికి అమ్ముకునే స్థాయికి ఫ్యాక్టరీ నిర్వాహకులు చేరారు. యాజమాన్య దాష్టీకానికి ఇద్దరు ఉద్యోగులు బలైపోయారు. పరంపర-2 పేరుతో మోసపోయిన ఓ పర్మినెంట్ ఉద్యోగి పేపరుమిల్లులోనే సూసైడ్ చేసుకున్నాడు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు సీఎం చంద్రబాబుతో ఫ్యాక్టరీ సమస్యలపై చర్చించగా ఓ ఉన్నతస్థాయి కమిటీ నియామకానికి ఆదేశించిన సంగతి తెలిసిందే. కానీ యాజమాన్య మొండి వైఖరిని తట్టుకోలేక ఈ నెల 2వ తేదీ నుంచి కార్మికులు సమ్మెకు దిగారు. వాళ్లను బెదిరించడానికి ఆదివారం అర్ధరాత్రి తర్వాత నిబంధనలకు విరుద్ధంగా యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. కూటమి నాయకులు రంగంలోకి దిగడంతో యాజమాన్యం లాకౌట్ విరమించింది.

ఎంతో చరిత్ర గల పేపరుమిల్లు

రాజమండ్రిలో 1912లో బ్రిటీష్‌వాళ్లు కర్నాటిక్ పేపరుమిల్లు లిమిటెడ్ పేరుతో ఏర్పాటు చేశారు. 1929లో ఆంధ్ర పేపరుమిల్లు లిమిటెడ్‌గా మారింది. 1953లో మద్రాసు నుంచి విడిపోయి ఉమ్మడి ఆంధ్ర ఏర్పడిన తర్వాత ప్రభుత్వం దీనిని స్వాధీనం చేసుకుంది. రోజుకు 10 టన్నులు ఉత్పత్తి లక్ష్యంగా ఉండేది. 1964లో ప్రైవేట్ భాగ స్వామ్యం వచ్చింది. 2011లో అమెరికా కంపెనీ ఇంటర్నేషనల్ పేపరు చేతిలోకి వెళ్లింది. 75 శాతం వాటా వాళ్లకు దక్కింది. మిగతా ప్రభుత్వ వాటాగా ఉంది.2019లో కర్నాటకకు చెందిన వెస్ట్‌కోస్ట్ పేపరుమిల్లు లిమిటెడ్ (డబ్ల్యుసీపీఎం)కు చెందిన ఎస్.ఎన్ బంగూరీ కొన్నారు. తర్వాత దానికి ఈడీగా, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా రాజస్థాన్‌కు చెందిన ముఖేష్ జైన్ నియమితులయ్యారు. అక్కడ నుంచి ఈ మిల్లుకు కష్టాలు ఆరంభమయ్యాయి. ఇక్కడ పర్మినెంట్ వర్కర్లు సుమారు 800, పర్మినెంట్ ఉద్యోగులు 550 వరకూ ఉండగా, కాంట్రాక్టు కార్మికులు సుమారు 2 వేలమంది ఉన్నారు. ప్రస్తుతం రోజుకు రూ.5 కోట్ల టర్నో వర్‌గా ఉంది.ఏడాదికి రూ.2 వేల కోట్లు టర్నోవర్‌తో పేపరుమిల్లు నడుస్తోంది.

● ముఖేష్ జైన్ దాష్టీకాలు

మిల్లు ఆరంభం నుంచి యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య మూడున్నరేళ్లకోసారి వేతన ఒప్పందం జరుగుతుంది. ఈ సమయంలో పర్మినెంట్ ఉద్యోగులకు జీతాలు పెంచడం పదోన్నతులు ఇవ్వడంతోపాటు, కాంట్రాక్టు కార్మికుల సీనియార్టీని పరిగణించి వారిని పర్మి నెంట్ చేయడం ఆనవాయితీగా వచ్చేది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఆ ఏడాది జూలై నుంచి డిసెంబరు 23 మధ్యలో రాబోయే మూడున్నరేళ్లకోసం ఒప్పందం జరగాలి. ఈ వేతన ఒప్పందానికి యాజమాన్యంతో కుమ్మక్కయిన ముఖేష్ జైన్ గండి కొట్టారు. కీలక స్థానాల్లో ఉన్న తెలుగు ఉద్యోగులపై పగ పట్టినట్టు వ్యవహరించడంతో 60నుంచి 70మంది ఉద్యోగాలు మానేసి వెళ్లిపోవడం గమనార్హం. తన మాట వినే వాళ్లను మాత్రం కొంతమందిని దగ్గర చేర్చుకున్నాడు. తన ఇంట్లో పనిచేసే వ్యక్తుల భార్యలకు ఒకరికి స్టోర్‌లో, మరొకరికి హెచ్‌ఆర్‌లోనూ ఉద్యోగులివ్వడం గమనార్హం. అతని బాధలు తట్టుకోలేక కమల కిశోర్ బ్రెయిన్ ట్యూమర్, విజయ్ అనే సివిల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి గుండె పోటుతో మృతిచెందినట్టు సమాచారం. పరంపర-2 పేరుతో ఉద్యోగాలిస్తామని వేరేవాళ్ల దగ్గర డబ్బు తీసుకుని ఉద్యోగం ఇవ్వకపోవడంతో తట్టు కోలేక పర్మినెంట్ ఉద్యోగి ఎస్.సత్యనారాయణ పేపరు మిల్లులోనే సూసైడ్ చేసుకున్నాడు. దీనిపై కూడా కేసు నమోదైంది. తర్వాత ఓ రాజకీయ నేత సహకారంతో రూ.23 లక్షలకు బాధిత కుటుంబంతో ఒప్పందం పెట్టుకు న్నట్టు సమాచారం. ఇక్కడ టీఎన్‌టీయూసీ నేతగా ఉన్న ప్రవీణ్ చౌదరిని లోబర్చుకుని అతన్ని వైసీపీ నేతలకు దగ్గరయ్యేలా చేసి అతనితో కోర్టులో కేసు వేయించి ఒప్పందంలో జాప్యం జరిగేలా ప్రయత్నం జరిగింది. తర్వాత అతను కేసు తీసేసు కున్నా కార్మికులు అడిగిన రూ.10,500 వేతన పెంపు ఒప్పందానికి అంగీకరించకుండా యాజమాన్యం హైకోర్టులో కేసు వేసింది. తర్వాత పరంపర-2 పేరుతో సీనియర్లు అయిన పర్మినెంట్ ఉద్యోగులకు కొంత డబ్బు ఆశచూపి వారిని ఉద్యోగ విరమణ చేయించాడు. వారి స్థానంలో కాంట్రాక్టు కార్మికులను సీనియార్టీ ప్రకారం పర్మినెంట్ చేయకుండా, అసలు పేపరుమిల్లుతో సంబంధం లేని సుమారు 150మంది వద్ద రూ.8లక్షల నుంచి రూ.20లక్షల వరకూ ఒకొక్కరి వద్ద తీసుకుని వారికి ఉద్యోగా లివ్వడం గమనార్హం. పైగా వారికి కూడా కనీస వేతనం రూ.11,500 వరకూ మాత్రమే. అదీ పూర్తిగా రాదు. ఇలా కార్మికులను, వారి కుటుంబాలను నిలువునా ముంచేశారు.



ఇటీవల పేపరు మిల్లు గేటుకు అంటించిన లాకౌట్ నోటీసు

ఎన్నికల ముందు నాటకం

గత సార్వత్రిక ఎన్నికల ముందు నాటకీయంగా యాజమాన్యం వ్యవహరించింది. కార్మికులంతా సమ్మెలో ఉండడంతోపాటు వైసీపీకి వ్యతిరేకంగా వ్యవహరించడంతో ఏమైందోకానీ అప్పటి కలెక్టర్ మాధవీలతను రంగంలోకి దింపి వేతన ఒప్పందం చేసుకునేటట్టు హామీఇచ్చారు. ఎన్నికలు పూర్తయినా యాజమాన్య వైఖరి మారక పోవడంతో ఇటీవల కార్మిక సంఘ నేతలు తెలుగుదేశం కూటమి నేతలను ఆశ్రయించారు. వారితో పాటు ప్రస్తుత కలెక్టర్ పి.ప్రశాంతి కూడా యాజమాన్యంతో చర్చలు జరపడంతో కేవలం రూ.3,500 మాత్రమే పెంచుతానని యాజమాన్యం మొండి వైఖరి ప్రదర్శించడంతో సమస్య జటిలమైంది.

● అరెస్ట్ చేయని పోలీసులు

ఈడీ ముఖేష్ జైన్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఒక మహిళను ప్రలోభపెట్టి మోసం చేసినట్టు గత నవంబరులో సదరు మహిళ పోలీసులను ఆశ్రయించింది. బొమ్మూరు సీఐ కాశీ విశ్వేశ్వరరావు కేసు నమోదు చేసి నిందితుడిని ఇంతవరకూ అరెస్ట్ చేయలేదు. ముఖేష్ రాజమహేంద్రవరం నుంచి పరారై హైదరాబాద్‌లోని తన సోదరి ఇంట్లో నుంచి ఇక్కడ పేపరుమిల్లు వ్యవహారాలు చక్కపెడుతుండడం గమనార్హం. ఆయన ఫోన్ కూడా పనిచేస్తుందని అందరూ చెబుతున్నారు. కానీ బొమ్మూరు పోలీసులకు మాత్రం ఆయనను అరెస్ట్ చేసే తీరిక లేకపోవడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

● సీఎం చంద్రబాబుతో కూటమి నేతల భేటీ

పేపరుమిల్లును కాపాడుకోవడంకోసం ఇటీవల రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ ఇటీవల సీఎం చంద్రబాబును కలసి సమస్యను వివరించగా ఆయన యాజమాన్య వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాక ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటుకు ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయి.

వైసీపీ వల్లే అధ్వానంగా ఏడీబీ రోడ్డు

- ● డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్
- ● ఏడీబీ రహదారి విస్తరణ పనుల పరిశీలన

రంగంపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఏడీబీ రోడ్డు పనులను పటించుకోనందువల్లే అధ్వానంగా తయారైందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. శుక్రవారం పిఠాపురం పర్యటకు వచ్చిన ఆయన మధురపూడి విమానాశ్రయం నుంచి రాజానగరం, రంగంపేట మీదుగా ఏడీబీ రోడ్‌లో పిఠాపురం బయలుదేరివెళ్లారు. ఈ సందర్భంగా ఇటీవల తూర్పుగోదావరి జిల్లా వేమగిరి వద్ద గేమ్ ఛేంజర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హాజరై తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో వడిశలేరు గ్రామంలోని కార్గిల్‌ఫ్యాక్టరీ వద్ద ఏడీబీ రోడ్‌లో కాకినాడ జిల్లా గైగోలుపాడుకు చెందిన తోకాడ చరణ్, ఆరవ మణికంఠ ప్రమాదానికి గురై మరణించిన సంఘటనా స్థలాన్ని పవన్ పరిశీలించారు. ప్రమాద ఘటనకు సంబంధించిన వివరాలను తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏడీబీ రహదారి విస్తరణ పనులను పరిశీలించి, సమగ్ర వివరాలను తెలుసుకున్నారు.

రాజానగరం నుంచి సామర్లకోట ఏడీబీ రోడ్డు నాలుగులైన్లు విస్తరణ రహదారి పనుల పురోగతిపై క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పనుల పురోగతి, తదితర అంశాలపై వివరించారు. నాలుగులైన్లు రహదారిగా అభివృద్ధికి చెందిన 30 కిలో మీటర్లలో 16.29 కిలో మీటర్లు తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఉందని, ఇందునిమిత్తం 189 కోట్ల, 87 లక్షల రూపాయిల ప్రాజెక్టు అంచనాతో పనులు చేపట్టడం జరిగిందని వివరించారు. 2017 అక్టోబరులో పనుల చేపట్టగా 2021 ఫిబ్రవరిలో పూర్తి చేయాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు పనులను 2025 ఆగస్టు నాటికి పూర్తి చేసేలా ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంకు అనుమతి ఇచ్చిందని, ఆ మేరకు పనులను పూర్తి చేసే క్రమంలో చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. జిల్లా పరిధిలో ఉన్న రూట్‌మ్యాప్ ప్రకటనలో గ్రామాల వారీగా పనుల పురోగతిని కలెక్టర్ వివరించారు. పరిహారం చెల్లింపులకు చెందిన బిల్లులు అప్లోడ్ చేసినట్టు తెలిపారు. ఎస్టీరాజాపురం వద్ద కల్వర్టు నిర్మాణ పనులను పవన్ పరిశీలించారు. ఈ పర్యటనలో ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, డీఎస్పీ భవ్యకిషోర్, ఏపీ రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అయితే ఇక నుంచి పిఠాపురం నియోజకవర్గం ఎప్పుడు వెళ్లినా సరే ఏడీబీ రోడ్డు మీదుగానే వెళతానని పవన్ చెప్పిన విషయం అందరికీ తెలిసినదే. మాట ప్రకారమే శుక్రవారం ఏడీబీ రోడ్డు మీదుగానే ఆయన పిఠాపురం వెళ్లారు.



రంగంపేట మండలం ఎస్టీరాజాపురం వద్ద కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్

గోదావరిలో
అక్రమంగా ఇసుక డ్రెడ్జింగ్

- బోట్స్‌మన్ సొసైటీల ముసుగులో విచ్చలవిడిగా ఇసుక దోపిడీ
- ఏమీ చేయలేని పరిస్థితిలో అధికారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అఖండ గోదావరిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక డ్రెడ్జింగ్ చేస్తున్నారు. అధికారికంగా ఎటువంటి అనుమతులు ఇవ్వనప్పటికీ, రాత్రి వేళ ఇష్టానుసారం ఇసుక డ్రెడ్జింగ్ చేస్తున్నారు. బోట్స్‌మన్ సొసైటీల ముసుగులో కూటమికి చెందిన వారే విచ్చలవిడిగా ఇసుక దోపిడీ చేయడం గమనార్హం. రాజమహేంద్రవరం వైపు గాయత్రీ, కోటిలింగాల, కొవ్వూరు వైపు కొవ్వూరు నుంచి వాడపల్లి, అరికరేవుల తదితర ప్రాంతాల్లో నిబంధనలకు తూట్లు పొడిచి, ఇసుక డ్రెడ్జింగ్ చేస్తున్నారు. అధికారులు ఎంత కఠినంగా వ్యవహించాలని చూసినా వారిని ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు చేయగలిగిందని కొంతవరకూ ఇసుక కొరత లేకుండా చేయడమే. అక్రమాలను మాత్రం ఆపలేకపోతున్నారు. బోట్స్‌మన్ సొసైటీలంటే కేవలం పడవల మీద ఇసుక తీసే కార్మికులకే ఇవ్వాలి. వారి ఉపాధికోసమే ఈ పని అప్పగించాలి. కానీ వేరే రాష్ట్రాల నుంచి కార్మికులను తక్కువ కూలీకి తెచ్చి పనిచేయించుకోవడంతోపాటు స్థానిక కార్మికుల పొట్టకొడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కాకుండా లారీకి రూ.3వేల నుంచి రూ.4వేల వరకూ అదనంగా వసూలు చేస్తున్నారు. ఓపెన్ రీచ్‌లన్నీ ప్రారంభిస్తే ఈ దోపిడీ కొంతవరకూ అదుపు చేసే అవకాశం ఉంటుంది. వేమగిరి ఓపెన్ రీచ్‌లో కూడా అక్రమంగా ఇసుక తవ్వుతున్న యంత్రాలను సీజ్ చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలో మిగతా ఓపెన్ రీచ్ లన్నింటికీ త్వరగా అనుమతిస్తే ఇసుక లభ్యత ఉంటుంది. దీంతో కొంతవరకూ అక్రమాలను అరికట్టే అవకాశం కూడా ఉంటుంది. ఈసారి అధికారులు కాతేరు ర్యాంపులకు ఇంకా అనుమతివ్వలేదు. ఇక్కడ కూడా బోట్స్‌మన్ సొసైటీలు ఉన్నాయి. మరొక పక్క మినీ మెకనైజ్డ్ బోట్లకు అనుమతిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. అవి త్వరగా ఇచ్చినా ఇసుక కావలసినంత దొరిక అక్రమాలు కూడా అదుపులో ఉంటాయి.

నేటి నుంచి ఆత్రేయపురంలో సంక్రాంతి సంబరాలు

- ● మూడురోజులపాటు రంగోలి, స్విమ్మింగ్, పడవల పోటీలు, డ్రాగన్ బోటు పోటీలు
- ● పాల్గొననున్న జాతీయస్థాయి క్రీడాకారులు ● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఆత్రేయపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలు మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. శనివారం ఆత్రేయపురం రేవు వద్ద ప్రారంభంకానున్నాయి. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ హాజరుకానున్నారు. ఈ పోటీల్లో జాతీయస్థాయి క్రీడాకారులు పాల్గొంటారు. ఆత్రేయపురంలో క్రీడాకారులకు వసతి ఏర్పాటు చేశారు. ఈనెల 11న రంగోలి పోటీలు నిర్వహించనున్నారు. 350 మంది మహిళలు పాల్గొంటారు. అలాగే మూడు విభాగాల్లో స్విమ్మింగ్ పోటీలు, పతంగులు ఎగురవేయడం నిర్వహించనున్నారు. 12నఉదయం పడవల పోటీలు, డ్రాగన్ బోటు పోటీలు నిర్వహిస్తారు. 13న ఈత, పడవ పోటీలు సెమీ ఫైనల్స్ నిర్వహించి బహుమతులు ప్రదానం చేయనున్నారు. పడవ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి 15 టీమ్‌లకు సంబంధించి 100మంది తరలివచ్చారు. పడవ పోటీలకు ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50వేలు, తృతీయ బహుమతి రూ.30వేలు... ఈత, పతంగుల్లో పోటీల్లో విజేతలకు ప్రథమం రూ.15వేలు, ద్వితీయం రూ.10వేలు, తృతీయం రూ.7,500 మెడల్స్‌తో అందించనున్నారు. లొల్ల లాకుల ఉచ్చిలి వరకు కాలువ గట్లను శుభ్రం చేసి సిద్ధపరిచారు. పోటీలు తిలకించేందుకు బారికేడ్లు, ట్రాఫిక్ మళ్లింపు తదితర కార్యక్రమాలను వివిధ శాఖల పర్యవేక్షణలో నిర్వహించారు. శుక్రవారం ఆర్డీవో పి.శ్రీకర్, తహశీల్దార్ రాజేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.పలు శాఖాధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.





ఆత్రేయపురం ప్రధాన కాలువలో పడవ పోటీల ట్రైల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

నిమిషాల్లో రూ.5.28 లక్షలు మాయం

- మోటారు సైకిల్‌పై వెళ్తూ నగదు పోగొట్టుకున్న ధాన్యం వ్యాపారి

ద్రాక్షారామ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం కాపవరం గ్రామానికి చెందిన ధాన్యం వ్యాపారి మోటారు సైకిల్‌పై వెళుతూ రూ.5.28 లక్షలు నగదు పోగొట్టుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కాపవరానికి చెందిన రెడ్నం రామచంద్రరావు ఈనెల 8న రామచంద్రపురం వచ్చి పెయింటింగ్‌కు సూర్యసెమ్ 10 కిలోల ప్యాకెట్ కొనుగోలు చేశాడు. ధాన్యం వాప్యారం తాలూకా సౌమ్య రైసుమిల్లు యజమానికి వద్దకు వెళ్లి రూ.5.28 లక్షలు నగదు తీసుకున్నాడు. తనతోపాటు తెచ్చుకున్న సంచిలో నగదు పెట్టి ఆపైన వైట్‌సిమెంటు ప్యాకెట్ పెట్టి తన మోటారు సైకిల్ వెనకపక్క ఉన్నరింగుకు సంచి తగిలించాడు. తిరిగి కాపవరం బయలుదేరాడు. మధ్యలో వెనుక సంచిని గమనిస్తూ ప్రయాణం సాగించాడు. వెల్ల గ్రామం దాటిన తరువాత తాడిపల్లి వెళ్లే రోడ్డు వద్ద ఒకసారి వెనుకకు తిరిగి చూశాడు. సంచి ఉంది. అనంతరం ఇంటికి వెళ్లి చూడగా రింగుకు సంచి ఒకతాడు మాత్రమే ఉంది. సంచిలేదు. దీంతో వెంటనే తాడిపల్లి రోడ్డు జంక్షన్ వరకు రోడ్డులో వెళ్లిచూశాడు. సంచి కనపడలేదు. వెంటనే కందులపాలెం వంతెన వద్ద ఉన్న దుర్గమ్మగుడి వద్ద సీసీ కెమెరాను పరిశీలించగా రాత్రి 8.27గంటలకు సంచి ఒక తాడు తెగివేలాడుతూ కనిపించింది. తిరిగి వచ్చిన సమయం చూసేసరికి 8.36 గంటలు అయింది. సీసీ కెమెరా పుటేజీ ప్రకారం రామచంద్రరావు ఎదురుగా మోటారు సైకిల్ వచ్చి కందులపాలెం వైపు వెళ్లిపోయింది. నిమిషాల వ్యవధిలో వెనుక వైపు నుంచి కారు, మోటారు సైకిల్ ఉండూరు వైపుగా వెళ్లాయి. దీంతో రామచంద్రరావు ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రాజమహేంద్రవరంలో యువకుడి ఆత్మహత్య

- కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆవరోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో ఒక ఇంట్లో యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని టూటౌన్ పోలీసులు తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుక్కుంపేట వరలక్ష్మికాలనీకి చెందిన ఐ.సాయి(22) ఆప్టింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆవరోడ్డుకు చెందిన కిరణ్ వద్ద కీబోర్డు నేర్చుకుని ఈవెంట్‌లు చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఈవెంట్‌కి వెళ్తున్నట్టుగా ఇంట్లో చెప్పి కిరణ్ ఇంటికి వచ్చాడు. ఇద్దరూ కలిసి ఈవెంట్‌కి వెళ్లి వచ్చారు. రాత్రికి ఆవరోడ్డులోని కిరణ్ ఇంట్లో ఉండిపోయాడు. శుక్రవారం ఉదయం కూడా ఫోనులో స్నేహితులతో మాట్లాడారు. ఈ క్రమంలో కిరణ్ బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి సాయి ఉరివేసుకుని వేలాడుతున్నాడని, ఇది గమనించి వెంటనే సాయిని కిరణ్ కిందికి దించి ఆస్పత్రికి తరలించే లోపు మరణించాడని పోలీసులు తెలిపారు. సాయి తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సాయి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో తెలియాల్సి ఉంది. ఈ మేరకు రాజమహేంద్రవరం టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సాయి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

‘ఆదిత్య’లో ఉత్సాహంగా కలర్స్

గండేపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో ఆదిత్య కలర్స్ యూత్ ఫెస్ట్ యువజనోత్సవాలు రెండో రోజైన శుక్రవారం మరింత ఉత్సాహంగా సాగాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థినుల సంప్రదాయ నృత్యాలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. ఫ్యాషన్ షోలో సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. స్కిట్‌లు ఆద్యంతం నవ్వులు పూయించాయి. 800 మీటర్ల పరుగు పందెంలో పురుషుల విభాగంలో కేఎల్ యూనివర్శిటీ, మహిళల విభాగంలో ఆదిత్య యూనివర్శిటీ ప్రథమ స్థానాల్లో నిలిచాయి. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, త్రోబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ విభాగాల్లో విజేతలకు ఆదిత్యయూనివర్శిటీ ప్రో చాన్సలర్ ఎన్.సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రమేష్, వివిధ విభాగాల డీన్‌లు బహుమతులు అందజేశారు.





వాలీబాల్, ఫ్యాషన్ షో పోటీల దృశ్యాలు

సంక్రాంతికి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, జనవరి 10 (ఆంధ్ర జ్యోతి): సంక్రాంతి పండుగ రోజుల్లో రైలు ప్రయాణికులకు మరింత సేవలందించేందుకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను సామర్లకోట మీదుగా వివిధ ప్రాంతాలకు అందుబాటులోకి తెస్తున్నట్టు రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి పీఆర్ నంబరు 760 పేరిట ఉత్తర్వులు జారీ చేశారు. సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారాన్ని ఆంధ్రజ్యోతి సేకరించింది.

- ● 07038 నెంబరు గల కాకినాడ నుంచి చర్లపల్లి మధ్య నడిచే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13న రాత్రి 8.30 గంటలకు బయలుదేరి సామర్లకోటకు 8.45 గంటలకు చేరుకుని తిరిగి రాజమహేంద్రవరం మీదుగా చర్లపల్లికి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు చేరుతుంది.
- ● 07078 నెంబరు గల సికింద్రాబాద్-కాకినాడ టౌన్ మధ్య నడిచే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 12, 19ల్లో సికింద్రాబాద్ నుంచి ఉదయం 10.05 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 7.15 గంటలకు సామర్లకోటకు చేరుకుని కాకినాడకు 7.30 గంటలకు చేరుతుంది.
- ● 07079 నెంబరుగల కాకినాడ నుంచి సికింద్రాబాద్ మధ్య నడిచే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 12,19ల్లో కాకినాడ నుంచి రాత్రి 8 గంటలకు బయలుదేరి 8.15గంటలకు సామర్లకోటకు చేరుకుని రాజమహేంద్రవరం మీదుగా సికింద్రాబాద్‌కు మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు చేరుతుంది.
- ● 07031 చర్లపల్లి-కాకినాడ మధ్య ప్రత్యేక ఎక్స్ ప్రెస్ ఈనెల 12,14ల్లో రాత్రి 9.45 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.15 గం టలకు సామర్లకోటకు చేరుకుని 8.30 గంటలకు కాకినాడకు చేరుతుంది.
- ● 07032 కాకినాడ-చర్లపల్లి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 11,13,15ల్లో రాత్రి 8.30గంటలకు బయలుదేరి సామర్లకోటకు 8.45 గంటలకు చేరుకుని తిరిగి చర్లపల్లికి మరుసటి రోజు ఉదయం 8.35 గంటలకు చేరుతుంది.
- ● 07487 నాందేడ్-కాకినాడ టౌన్ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌రైలు ఈనెల 13న మధ్యాహ్నం 2.25 గంటలకు నాంధేడ్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.55 గంటలకు సామర్లకోటకు చేరుకుని తిరిగి 8.10 గంటలకు కాకినాడకు చేరుకుంటుంది.
- ● 07488 కాకినాడ టౌన్-నాందేడ్ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 14న సాయంత్రం 6.30 గంటలకు కాకినాడలో బయలుదేరి సామర్లకోటకు 6.45గంటలకు చేరుకుని రాజమహేంద్రవరం మీదుగా నాందేడ్‌కు మరుసటి రోజు మధ్యాహ్నం 3.10 గంటలకు చేరుతుంది.

మన్యంలో చలి పంజా

దేవీపట్నం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): దేవీపట్నం మండలంలో గత నెల నుంచి చలి తీవ్రత పెరగడంతో ఆయా గ్రామాల ప్రజలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8గంటల వరకు ఇళ్లల్లో నుంచి బయటకు రాని పరిస్థితి కనిపిస్తోంది. రైతులు, వ్యవసాయ కూలీలు, చిరు వ్యాపారులు తమ పనులకు వెళ్లేందుకు చలి దెబ్బకి వెనుకడుగు వేస్తున్నారు. సాయంత్రం 5గంటల సమయానికి చీకటి పడి చలి గాలులు వీయడంతో ఎవరూ ఇళ్లల్లో నుంచి బయటకు రావడంలేదు. చలి మంటలు వేసుకుని కాగుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆలమూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామంలో శుక్రవారం జాతీయ రహదారిపై బస్ షెల్టర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఆలమూరు ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 45 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి గత కొద్ది రోజులుగా సమీప గ్రామాల్లో భిక్షాటన చేస్తూ తిరిగేవాడని స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండపేట ఏరియా ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

సొసైటీ సభ్యులకు నగదు పంపిణీ

రాజోలు, జనవరి10(ఆంధ్రజ్యోతి): పొన్నమండ ఫీల్డులేబర్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కె.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా 370మంది సభ్యులకు రూ.2వేలు చొప్పున పంపిణీ చేశామని రాజ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఎన్.సూర్యం, యు.రాజబాబు, కె.వెంకటేశ్వరరావు, పి.రాజారావు, డి.ఏడుకొండలు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌కు స్థల పరిశీలన

పి.గన్నవరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంలో అన్నక్యాంటీన్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. శుక్రవారం తహశీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీవో కేవీ ప్రసాద్ ఆక్విడెక్టు సమీపంలోని ఇరిగేషన్ స్థలాన్ని పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు సమాచారం. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి పాల్గొన్నారు.

సంక్రాంతి ముందస్తు సంబరాలు

పలు ప్రైవేట్ పాఠశాలల్లో భోగిమంటలు

అమలాపురం రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కామనగరువు ఆదిత్య పాఠశాల, గొల్లగూడెం ఆదిత్య పాఠశాలల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ప్రిన్సిపాల్స్ రామ్‌ప్రసాద్, కె.లక్ష్మీదేవిల అధ్యక్షతన విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఫుడ్ ఫెస్టివల్ పేరిట సంక్రాంతి పిండి వంటలను ఆహుతులకు రుచి చూపించారు. చిన్నారులకు భోగిపండ్లు పోశారు. బొమ్మలకొలువు, గుడి నమూనా, పల్లెటూరు, పచ్చని పంటపొలాల సెట్టింగులు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు భోగిమంటలు వేసి ప్రభలను ఊరేగించారు. సంప్రదాయ బద్ధంగా సంక్రాంతి వేడుకలు నిర్వహించిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.చలపతిరావు, వైస్ ప్రిన్సిపాల్ సుధ అభినందించారు. అమలాపురం విద్యానిధి విద్యా సంస్థల ప్రాంగణంలో సంక్రాంతికి వస్తున్నాం.. అంటూ నిర్వహించిన వేడుకలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, హరిదాసులు, కొమ్మదాసరులు, సోదమ్మలు, గోదాదేవి, లక్ష్మీనారాయణుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఆధునిక హరిదాసుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గంగిరెడ్ల కోలాటాలు అలరించాయి. విద్యా సంస్థల అధినేత ఏబీ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో డైరెక్టర్ ఎ.శ్యామలా మహాలక్ష్మి, ప్రిన్సిపాల్ బి.సుధీర్‌బాబు పాల్గొన్నారు.



అమలాపురం: గొల్లగూడెం ఆదిత్య పాఠశాలలో సంక్రాంతి భోగిమంటలు

భోగిమంటలు

అంతర్వేది, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిలంక జిల్లాపరిషత్ హైస్కూలులో విద్యార్థులు, ఉపాధ్యాయులు పతంగులు ఎగరవేసి కేరింతలతో సంతోషాల నడుమ సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. హరిదాసుతో పాటు గంగిరెడ్లను కూడా సిద్ధంచేసి సంబరాలను అంబరాన్నంటేలా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో భోగిమంటలు వేసి సంక్రాంతి శోభను తీసుకువచ్చారు. మండలంలోని పలు పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. పాఠశాల విద్యాకమిటీ, అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, ఏపీఎస్టీసీ స్టేట్ మోనటరింగ్ అధికారి జి.ప్రభావతి పాల్గొన్నారు.

హరిదాసు వేషధారణల్లో విద్యార్థులు

మామిడికుదురు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముందస్తు సంక్రాంతి సంబరాలను మామిడికుదురు దీప్తి స్కూలు, శ్రీవిద్య స్కూలులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక దీప్తి స్కూలులో విద్యార్థినీ విద్యార్థులు వివిధ రకాల సంప్రదాయ దుస్తులు ధరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా జరిగిన ముగ్గుల పోటీల్లో బాలికలు ఉత్సాహంగా ముగ్గులు వేశారు. హరిదాసు, సోదమ్మ తదితర వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. శ్రీవిద్య స్కూలులో విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి రెండెడ్లబండిపై ఊరేగారు. ఆయా స్కూళ్లలో సంక్రాంతి ఉత్సవాలను ఉల్లాసంగా ఉత్సాహంగా జరుపుకున్నారు.

గంగిరెద్దుల విన్యాసాలు

ముమ్మిడివరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని యాపిల్ స్కూలులో విద్యార్థినులు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సంబరాలు జరుపుకున్నారు. ప్రభల ఊరేగింపు, రంగురంగుల రంగవల్లులు, గొబ్బెమ్మల పాటలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలతో పాఠశాలప్రాంగణం సంక్రాంతి శోభను సంతరించుకుంది. భోగిమంటలువేసి గంగిరెద్దులతో విన్యాసాలు చేయించి రంగవల్లులు తీర్చిదిద్ది వాటిలో గొబ్బెమ్మలను పెట్టి ఉంచి పాటలు పాడారు. కళాశాల కరస్పాండెంట్ గోదశి పుండరీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'సంక్రాంతి సరదాలకు ఎస్.యానాం బీచ్‌కు రండి'



బీచ్‌లో సంక్రాంతి సంబరాలు టీజర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

ఉప్పలగుప్తం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తెలుగు వారి పెద్దపండుగ సంక్రాంతి సంబరాలకు ఆంధ్రా గోవా ఎస్.యానాం బీచ్‌కు రావాలంటూ అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆహ్వానం పలికారు. ఎస్.యానం బీచ్‌లో శుక్రవారం సినీ, జబర్దస్త్ కళాకారులతో రూపొందించిన సంక్రాంతి సంబరాల టీజర్‌ను ఆయన విడుదల చేశారు. పలచోళ్ళ పద్మనాభం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈనెల13 నుంచి నాలుగు రోజుల పాటు బీచ్‌లో సంక్రాంతి ఆచారవ్యవహారాలను ప్రతిబింబిస్తూ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే కనుమరుగవుతున్న సంక్రాంతి సంప్రదాయాలను, పల్లెల అందాలను వీక్షించేందుకు ఎస్.యానాం రావాలంటూ ఆయన పిలుపునిచ్చారు. తొలుత సంక్రాంతి సంబరాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. సర్పంచ్ జోగి రాజేశ్వరీరాజా, ఎంపీటీసీ పెట్టా అప్పారావు, కూటమి నాయకులు లంకే భీమరాజు, సత్తి చిన్నా, అయితాబత్తుల రాజశేఖర్, ఉలిశెట్టి దొరబాబు, మేకల నానాజీ, పలచోళ్ళ బుజ్జి, పినిశెట్టి నరసింహారావు, సుంకర రాంబాబు, పలచోళ్ళ నారాయణరావు, చీకట్ల శ్రీను, రేవు తిరుపతిరావు పాల్గొన్నారు.

ఢిల్లీలో అధికారులతో మల్లాడి భేటీ

యానాం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు శుక్రవారం ఢిల్లీలో పర్యటించారు. యానానికి సంబంధించిన అనేక అంశాలపై కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులతో సమావేశమయ్యారు. నేషనల్ హైవే అథారిటి ఆఫ్ ఇండియా చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్, మెంబర్ కె.వెంకటరమణలతో సమావేశమయ్యారు. తొలుత వారిని మల్లాడి సత్కరించారు. అనంతరం యానాంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న రోడ్లను అభివృద్ధి పరిచేందుకు నిధులు కేటాయించాలని కోరారు. ముఖ్యంగా జాతీయ రహదారి 2016 ద్రాక్షారామ రోడ్డు నుంచి ఫ్రెంచ్ చానల్ గోపాల్‌నగర్ మీదుగా మూడు తూములు వరకు రోడ్డు అభివృద్ధికి రూ.10కోట్లు కేటాయించాలని కోరారు. పాత బస్టాండ్ నుంచి అంబేడ్కనగర్, మెట్టకుర్రు, నవోదయ మీదుగా మూడుతూములు వరకు రూ.6కోట్లు, జెండా స్తంభం నుంచి కురసాంపేట మీదుగా సావిత్రి నగర్ వరకు రూ.21కోట్లు నిధులు కేటాయించాలని కోరారు. అదేవిధంగా పర్యాటక శాఖ అదనపు కార్యదర్శి సుమన్ బల్లాతో మల్లాడి భేటీ అయ్యారు. యానాం పర్యాటక అభివృద్ధికి రూ.30కోట్లు కేటాయించాలని కోరారు. మరో రెండు రోజులు మల్లాడి ఢిల్లీలో ఉండి అధికారులు, కేంద్రమంత్రులతో సమావేశం అవుతారు.



నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ చైర్మన్‌తో చర్చిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

టీడీపీలో అసమ్మతి



వీరవల్లిపాలెంలో సమావేశమైన టీడీపీ నాయకులు

అయినవిల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో మండలంలో అసమ్మతి చోటు చేసుకుంది. మండలంలో పదిహేను సహకార సంఘాలుండగా జనసేన 5, టీడీపీ 5 చోట్ల సహకార చైర్మన్ పదవులకు నిర్ణయించారు. జనసేనకు అయినవిల్లి, క్రాప, విలస, వీరవల్లిపాలెం, కె.జగన్నాథపురం, టీడీపీకి మాగాం, నేదునూరు, తొత్తరమూడి, ఎస్.మూలపొలం, పోతుకుర్రు సహకార సంఘాలను నిర్ణయించినట్టు సమాచారం. వీరవల్లిపాలెం సహకార సంఘానికి జనసేన నాయకులు టీడీపీ నాయకులను సంప్రదించకుండా నిర్ణయించడం పట్ల టీడీపీ నేతలు అసమ్మతి వ్యక్తం చేస్తున్నారు. వీరవల్లిపాలెంలో శుక్రవారం జరిగిన పలు మంచినీటి ట్యాంకుల శంకుస్థాపనకు టీడీపీ మండల నాయకులు, బీజేపీ నాయకులు బహిష్కరించారు. వీరవల్లిపాలెంలో టీడీపీ గ్రామ నాయకులు సమావేశమయ్యారు. సమావేశంలో మాజీ ఎంపీపీ సలాది పుల్లయ్యనాయుడు, బీజేపీ నాయకులు అడపా వీరేశ్వరరావు, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, మాజీ గ్రామకమిటీ అధ్యక్షుడు అడపా వెంకటేశ్వరరావు, దామిశెట్టి రామకృష్ణ, మేడిశెట్టి అంజిబాబు తదితరులు పాల్గొని అసమ్మతి వ్యక్తం చేశారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి పూజలు

కలియుగ దేవుడు ఉత్తర ద్వార దర్శనం

అంతర్వేది, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 6.30 గంటలకు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. తొలుత స్వామి-అమ్మవార్లను ఉత్తరముఖ ద్వారంలో ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు చేసిన అర్చకులు, వేద పండితులు ప్రత్యేక అలంకరణ అనంతరం విశేష పూజలు చేశారు. తొలి దర్శనం భక్తులతో పాటు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, జిల్లా ఏసీ వి.సత్యనారాయణ, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ఎంపీపీ వీరా మల్లిబాబు, రాష్ట్రమార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు స్వామిని దర్శించుకున్నారు. 8వేల మంది భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శనం చేసుకున్నారు. అనంతరం నిత్యాన్నదానంలో అన్నప్రసాదం స్వీకరించారు. వార్షిక అభిషేకంలో అంతర్వేది పల్లిపాలెం అగ్నికుల క్షత్రియులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, సాయంత్రం 4.30గంటలకు కంచుగరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రాజోలు నీటిసంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పినిశెట్టి బుజ్జి, వైస్‌చైర్మన్ ఆకన బాబ్జినాయుడు, వనమాలి మూలాస్వామి, ఎంపీటీసీ బైరా నాగరాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజామునే స్నానాలు ఆచరించి ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పల్లిపాలెంలోని శ్రీహరి సాకేత వేంకటేశ్వరస్వామి ఆలయం, ముమ్మిడివరంలోని శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి, పళ్లవారిపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు రామాలయాలు, విష్ణాలయాల్లో భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకున్నారు. ఉదయం నుంచి ఉపవాసాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. దీంతో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల వద్ద ప్రత్యేక భజనా కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

అమలాపురం టౌన్ (ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో తెల్లవారుజామున స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్తరద్వార దర్శనం ఏర్పాటుచేశారు. అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేకంగా చామంతిపూల పూజ నిర్వహించారు. ఉత్సవకమిటీ చైర్మన్ జంగా అబ్బాయివెంకన్న, కార్యనిర్వహణాధికారి యర్రా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారికి మధ్యాహ్నం గరుడవాహన సేవ, గ్రామోత్సవం జరిపించారు. కోనసీమ కళాకారుల సేవాసంఘం ఆధ్వర్యంలో చిన్నారులచే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. శంకుచక్ర నామ సహస్ర దీపాలంకరణ జరిపించారు. స్వామివారిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, నల్లా స్వామి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, దున్నాల దుర్గ దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు మోకా వెంకటసుబ్బారావు, దున్నాల వెంకటస్వామినాయుడు, కొమ్ముల ఆదిబాబు, కుంచే వెంకన్నబాబు, గోకరకొండ లక్ష్మణరావు, గన్నవరపు సూర్యభాస్కరరావు పాల్గొన్నారు.



అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో చామంతిపూల పూజ

మలికిపురం (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలన్నీ భక్తులతో కళకళ్లాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు పలు ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. మలికిపురం వేంకటేశ్వరస్వామి, సాయిబాబా ఆలయం, రామాలయాలు, విష్ణాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి పలు ఆలయాల్లో దీపాలంకరణ జరిపారు.

అల్లవరం (ఆంధ్రజ్యోతి): బంగారు తిరుపతిగా పేరొందిన బెండమూర్లంక లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా లక్ష్మీదేవిని స్మరిస్తూ ధాన్యలక్ష్మీదేవి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి భక్తులు ఉత్తర ద్వార దర్శనంతో లక్ష్మీవేంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. లయన్, సినీనటుడు గుర్రం రామకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, కంచర్ల వెంకటశ్రీరామమూర్తి తదితరులు దర్శించుకున్నారు. అల్లవరం, బెండమూర్లంక, తూర్పులంక, కొమరగరిపట్నం, డి.రావులపాలెం, గోడిలంక, బోడసకుర్రు తదితర గ్రామాల్లోని రామాలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు, భజనలు వేడుకగా జరిగాయి.

పి.గన్నవరం (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో స్వామివారు భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. లంకలగన్నవరంలో ఉన్న శ్రీభూదేవి అలివేలు మంగాసమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లను ప్రత్యేక పుష్పాలంకరణ గావించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏకావం భజన చేశారు. రాజులపాలెం రామాలయం, పి.గన్నవరం శ్రీపట్టాభిరామస్వామి ఆలయాలు, పోతవరం శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. మానేపల్లి, బెల్లం పూడి, నరేంద్రపురం, ముంగండ, కె.ఏనుగుపల్లి, వైకొత్తపల్లి తదితర గ్రామాల్లో వైష్ణవ ఆలయాల్లో స్వామి వారికి పూజలు నిర్వహించారు. స్వామివార్ని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. సీతారాముల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రామనామ స్మరణతో ఆలయాల వద్ద సందడి నెలకొంది. ఎస్.యానాం శ్రీరామ్‌నగర్‌లో అగ్నికులక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ముక్కోటి వేడుకలకు ఏర్పాట్లు చేశారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు రామాలయంలో పూజలు నిర్వహించారు. ఈనెల12న రామాలయం వద్ద పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ లంకే భీమరాజు తెలిపారు.

రాజోలు (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు తీరారు. తాటిపాక, వేగివారిపాలెం, మెరకపాలెం, శివకోడు, రాజోలు, పొన్నమండల, కడలి తదితర గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి ఆలయాలు, విష్ణాలయాలను విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించారు. పలు ఆలయాల్లో భక్తులు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు, రాత్రి దీపాలంకరణలు జరిగాయి.

అంబాజీపేట (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. అంబాజీపేట శివారు కొర్లపాటివారిపాలెంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి భక్తులు దర్శించుకున్నారు. పలు ఆల యాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. అంబాజీపేట పెద్దవీధిలోని రామాలయం, ఆంజనేయస్వామి ఆల యాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించారు.

కాట్రేనికోన (ఆంధ్రజ్యోతి): ముక్కోటి సందర్భంగా మండలంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పవిత్ర పుణ్యక్షేత్రం కుండలేశ్వరంలో శ్రీరుక్మిణీసత్యభామాసమేతవేణుగోపాలస్వామి, చెయ్యేరు శ్రీకేశవస్వామి, కాట్రేనికోన కల్యాణగోపాలస్వామి, పల్లంకుర్రు మదనగోపాలస్వామి, శ్రీవెంకటేశ్వరస్వామి, నడవపల్లి కోదండరామస్వామి ఆలయంతో పాటు అన్ని రామాలయాలు, విష్ణాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

ప్రభలు వెళ్లే రహదారికి మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అంబాజీపేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ముక్కామల లాకుల వద్ద ప్రభలు వెళ్లే రహదారికి మరమ్మతు పనులు చేపట్టారు. గత ఏడాది డిసెంబరు 31న ప్రభలు వెళ్లే రహదారి అధ్వానం అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ అధికారులు సీసీ రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టారు. గోతుల్లో గ్రావెల్‌ను వేసి మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో ఆ రహదారిపై వెళ్లే నేదునూరు, ముక్కామల, వక్కలంక ప్రజలతో పాటు ప్రభల నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

అంబాజీపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల15న జగ్గన్నతోటలో జరిగే ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవానికి సంబంధించి ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీఐ రుద్రరాజు భీమరాజు తెలిపారు. జగ్గన్నతోట ప్రభల తీర్థం జరిగే ప్రదేశాన్ని, ప్రభలు వచ్చే రహదారులను ఆయన ఎస్ఐ కె.చిరంజీవితో కలిసి పరిశీలించారు.

ఆర్ఐ రత్నరాణికి డీటీగా ఉద్యోగోన్నతి

యానాం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): యానాం రెవెన్యూ శాఖలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రత్నరాణికి పుదుచ్చేరి ఎన్నికలశాఖ డిప్యూటి తహశీల్దారుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నలుగురు డిప్యూటి తహశీల్దార్లను బదిలీ చేస్తూ ఉత్వర్తులు జారీ చేశారు. యానాంలో పనిచేస్తోన్న డిప్యూటి తహశీల్దార్ దండయుదపాణిని పుదుచ్చేరికి యానాం ఎన్నికలశాఖ డీటీగా, అక్కడ డీటీగా పనిచేస్తున్న జ్యోతి వెంకటేశ్వరరావును యానాం రెవెన్యూశాఖ డీటీగా నియమించారు. యానాం తూనికలు కొలతల శాఖ డీటీగా పనిచేస్తున్న గణేషన్‌కు పుదుచ్చేరికి బదిలీ చేశారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఓపెన్‌హౌస్



అమలాపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కోనసీమ రెవెన్యూ కేర్ పేరిట ఓపెన్ హౌస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రెవెన్యూ, పౌరసరఫరాలు, సర్వే అండ్‌ల్యాండ్ రికార్ట్స్ విభాగాలకు చెందిన ఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు ఓపెన్ హౌస్ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతీ నెల మూడు విభాగాల ఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన అంశాలపై అర్జీలను కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో ఆమె స్వీకరిస్తారు. రాష్ట్రంలో ఇంత వరకు ఏ జిల్లాలోను ఈవిధానం అమలు జరగడం లేదన్నారు. కోనసీమ జిల్లాలో ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించి పరిష్కార దిశగా కార్యక్రమం చేపట్టామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగులు సమస్యలను పరిష్కరించుకుంటూ ఆయా విభాగాల్లో సమగ్రాభివృద్ధిని సాధించి జిల్లాను అభివృద్ధి, సంక్షేమ పరంగా ప్రతిపథంలో నడిపించాలని కోరారు.

అరటి ఉత్పత్తి మార్కెటింగ్‌పై శ్రీదేవికి డాక్టరేట్



అమలాపురం టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అరటి ఉత్పత్తి మార్కెటింగ్ అనే అంశంపై అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాల ఆర్థికశాస్త్ర విభాగాధిపతి నల్లా శ్రీదేవిపార్వతి చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్థికశాస్త్ర ఆచార్యులు డాక్టర్ జి.నాగరాజు నేతృత్వంలో శ్రీదేవి పరిశోధనా పత్రాలను యూనివర్శిటీకి సమర్పించారు. అదేవిధంగా స్టేట్ లెవెల్ ఎలిజిబులిటీ టెస్ట్‌లో ఆమె ఉత్తీర్ణత సాధించారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్న శ్రీదేవి గతంలో అమలాపురం పురపాలక సంఘ 26వ వార్డు కౌన్సిలర్‌గా సేవలందించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి కుమార్తె అయిన శ్రీదేవిని ఎస్కేబీఆర్ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, కార్యదర్శి తాతా అవధాని, సభ్యులు డీఎస్ఎన్ రాజు, ప్రిన్సిపాల్ నూకల శ్రీనివాస్, సహచర అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

బీవీసీలో ముగిసిన గేమ్ డిజైన్ సెమినార్

అల్లవరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తృతీయ సంవత్సర విద్యార్థులకు గేమ్ డిజైన్ యూజింగ్ యూనిటీ త్రీడీ అనే అంశంపై సెమినార్ ముగిసింది. వారం రోజుల పాటు సి.సతీష్‌కుమార్ రిసోర్స్‌పర్సన్‌గా శిక్షణ ఇచ్చారు. సెక్రటరీ బోనం కనకయ్య, చైర్మన్ బోనం కృష్ణ సతీష్, ప్రిన్సిపాల్ మహేశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.ప్రవీణ్, డాక్టర్ మీరాషరీఫ్, డాక్టర్ కె.రాజశేఖర్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

అమెరికాలో రౌండ్ టేబుల్ సమావేశానికి సుబ్రహ్మణ్యం

అమలాపురం రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఈఏడాది అమెరికాలో జరిగే మిలియన్ డాలర్ రౌండ్ టేబుల్ సమావేశానికి బండారులంకకు చెందిన పిచ్చిక సుబ్రహ్మణ్యం అర్హత సాధించారు. ఎల్ఐసీ సంస్థ రాజమహేంద్రవరంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్ సాహూ ఆధ్వర్యంలో అవార్డు అందించి సత్కరించారు. జూన్ 22 నుంచి 25 వరకు అమెరికాలో జరిగే ఎండీఆర్టీ సమావేశంలో సుబ్రహ్మణ్యం పాల్గొంటారు. ఈసందర్భంగా సేల్స్ మేనేజర్ శ్రీనివాస్, రంగనాయకులు, కిరణ్ తదితరులు అభినందించారు.

కూటమి ప్రభుత్వంలో పాడిపరిశ్రమకు పెద్దపీట

పి.గన్నవరం, జనవరి10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో పాడి పరిశ్రమకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ఇస్తు పెద్దపీట వేశారని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పల్లెపండుగలో భాగంగా మండలంలోని ముంగండ గ్రామంలో మినీగోకులాన్ని ఆయన ప్రారంభించి అనంతరం మాట్లాడారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 134మినీగోకులాలు మంజూరుకాగా 49 పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయ న్నారు. త్వరలోనే గ్రామాల్లో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్లు ప్రారంభిస్తా మన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీవో కేవీ ప్రసాద్, సర్పంచ్ కుసుమ చంద్రకళ, ఏపీవో లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, వాసంశెట్టి కుమార్, పెచ్చెట్టి వెర్రియ్య, పప్పుల సాయిబాబు, యడ్ల ఏసుభాస్కరావు, పితాని రాంబాబు, అంబటి కోటేశ్వరరావు, నందెపు వెంకన్న, పెచ్చెట్టి ఏసు, భావన శ్రీనివాస్, అంబటి మణికంఠ పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికీ తాగునీరు: ఎమ్మెల్యే గిడ్డి



వీరవల్లిపాలెంలో ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

అయినవిల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటికీ తాగునీరు అందేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం వీరవల్లిపాలెంలో రూ.39లక్షలతో నిర్మించే రెండు తాగునీటి ట్యాంకుల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సలాది బుచ్చిరాజు, అడపా నాగభూషణం, పోటిశెట్టి రాజేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు, హెచ్ఆర్డీ సభ్యులు నేదునూరి వీర్రాజు, ఎంపీడీవో జి.భీమారావు, పంచాయతీ విస్తరణాధికారి వాణిశ్రీబెహరా, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు ఉపయోగపడేలా గోకులం షెడ్లు

మామిడికుదురు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాడి రైతులకు ఉపయోగపడే విధంగా గోకులం షెడ్లను మంజూరు చేసిందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా లూటుకుర్రు గ్రామంలో నిర్మించిన గోకులం షెడ్డును ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. 32 మినీ గోకులం షెడ్లను మొదటి విడతగా 55.77లక్షల తో నిర్మించే విధంగా రైతులకు మంజూరు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అడబాల తాతకాపు, ఎంపీటీసీలు నామన వెంకటేశ్వరరావు, జాలెం శ్రీనివాసరాజా, విశ్వ సుబ్బారావు పాల్గొన్నారు.

టీచర్స్ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

ముమ్మిడివరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): టీచర్స్ ఫెడరేషన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా శాఖ డైరీలు, క్యాలెండర్లను డీఈవో సలీంబాషా శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ మునేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఉందుర్తి వీరవెంకట్రావు, రాష్ట్ర కౌన్సిలర్ జీవీవీ సత్యనారాయణ, పినిపే కృష్ణమూర్తి, మోర్త రాజశేఖర్, గుత్తాల వెంకటేశ్వరరావు, ఎస్.నరసింహమూర్తి, పీతల రాంబాబు, సకిలే తిరుపతిరావు, వీధి రాజశేఖర్, మడికి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలంటూ ధర్నా



అంతర్వేది, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, గృహ నిర్మాణాలకు రూ.5లక్షలు కేటాయించాలని తదితర డిమాండ్లతో సఖినేటిపల్లి తహశీల్దార్ కార్యాలయంలో సీపీఐ, బీకేఎంయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులను, వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లి బుజ్జిబాబు, సఖినేటిపల్లి సీపీఐ మండల కార్యదర్శి గెడ్డం ప్రభాకరరావు, దీపాటి గంగాచలం, దొండపాటి చంద్రమోహన్, యడ్ల విజయరత్నం పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికుల రిలే దీక్ష

ముమ్మిడివరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ముమ్మిడివరం నగర పంచాయతీ కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగంలో ఎలక్ట్రీషియన్లు, పిట్టర్లుగా పనిచేస్తోన్న కాంట్రాక్టు కార్మికులంతా నగరపంచాయతీ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు పెట్టా శివప్రసాద్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ మునేశ్వరరావు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, ఎన్.అరుణకుమార్, వి.వెంకటేశ్వర్లు, వైవీ రమణ, ఎస్.అజయ్‌కుమార్, జి.రమేష్, కె.గోవిందరాజు, వి.ప్రసాద్, కె.శ్రీవెంకటశివ, కె.జార్జి, జి.వెంకటేశ్వరరావు, కె.శరత్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి తూర్పుపాలెం వంతెన

మలికిపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తూర్పుపాలెం వంతెనను అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తేనున్నామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఎనిమిదేళ్ల క్రితం అసంపూర్తిగా మిగిలిన వంతెన పనులను శుక్రవారం ఎమ్మెల్యే పునఃప్రారంభించారు. కార్యక్రమంలో తూర్పుపాలెం సర్పంచ్ గుర్లింక సత్తిబాబు, కేశనపల్లి సర్పంచ్ యెనుముల నాగు, అడబాల సాయిబాబు, అడబాల బ్రహ్మాజీ, అడబాల వేణు, అడబాల చినబాబు, దిరిశాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ కమిటీల నియామకం పూర్తి

కాట్రేనికోన, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడు సొసైటీలకు సంబంధించి కమిటీల నియామక ప్రక్రియ పూర్తయింది. టీడీపీ మండల అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు స్వగృహంలో చర్చల అనంతరం కూటమి నాయకులు కమిటీలను వెల్లడించారు. పల్లంకుర్రుకు మంతెన సూర్యభాస్కరరాజు, కందికుప్పకు నూకల మూర్తి, గెద్దనపల్లికి వనచర్ల నాగేశ్వరరావు, కాట్రేనికోనకు పెసంగి రంగారావువర్మ, ఉప్పూడికి మల్లి ఖార్జునరావు, చెయ్యేరుకు త్సవటపల్లి శ్రీనివాస్, కుండలేశ్వరం సొసైటీకి గంగుమళ్ళ రవికుమార్‌లను చైర్మన్లుగా నియమించినట్టు తెలిపారు.

రైతులకు ప్రోత్సాహకాలు

మలికిపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల కోసం పలు పథకాలు అమలు చేస్తోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల సందర్భంగా పడమటిపాలెంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో నిర్మించిన గోకులం షెడ్డును ఆయన ప్రారంభించారు. గోకులం షెడ్లు మంజూరైన రైతులంతా వెంటనే నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. పాడి పంటలు, పల్లెసీమలు సస్యశ్యామలంగా ఉండాలనేది ప్రభుత్వ ఆశయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల మాధవీలత, మాజీసర్పంచ్ ఆకుల చిన్నవెంకన్నాయుడు, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, మేడిచర్ల రాము, దిరిశాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

దళితచైతన్యవేదిక నాయకులతో తహశీల్దార్ చర్చలు

రాజోలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్‌తో షెడ్యూల్డు కులాల జాబితాకు సంబంధించిన పలు విషయాల గురించి దళిత చైతన్యవేదిక నాయకులు శుక్రవారం చర్చించారు. ఈసందర్భంగా దళిత చైతన్యవేదిక నాయకులు బత్తుల మురళీకృష్ణ మాట్లాడుతూ సోషల్ ఆడిట్‌లో భాగంగా షెడ్యూల్డు కులాల జాబితాకు సంబంధించిన లోపాలు లేకుండా వీఆర్వోల ద్వారా సరి చేయించాలని తహశీల్దార్‌ను దళిత నాయకులు కోరారు. వెంటనే స్పందించిన తహశీల్దార్ ప్రసాద్ మండలంలో ఉన్న 16గ్రామాల వీఆర్వోలతో మాట్లాడి షెడ్యూల్డు కులాల జాబితాల్లో ఏమైనా తప్పులుంటే సరి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మట్టా సురేష్‌కుమార్, చిలకపాటి శ్రీధర్‌పాల్గొన్నారు.

పాడిపరిశ్రమ అభివృద్ధికి కృషి

అంబాజీపేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పసుపల్లిలో మిని గోకులం షెడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాడిపరిశ్రమ అభివృద్ధిలో భాగంగా పాడి రైతులకు మినీ గోకులం పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఈపథకం ద్వారా షెడ్లు నిర్మించుకున్న వారికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీడీవో జీవీ సరోవర్, సర్పంచ్ మట్టపర్తి నాగరాజు, ఏపీవో అడపా వెంకట కృష్ణ, నాయకులు కుడుపూడి రాంబాబు, గంగుమళ్ళ వీరభద్రరారవు పాల్గొన్నారు.

ప్రభల తీర్థంపై సమీక్ష

అయినవిల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహశీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ అధ్యక్షతన ప్రభల తీర్థానికి సంబంధించి శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ సమక్షంలో జరిగిన సమావేశంలో శాంతిభద్రతల సమస్యల తలెత్తకుండా చర్చించారు. స్టేషన్ హౌస్‌ఆఫీసర్, ఎక్సైజ్ ఎస్ఐ, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలంలోని పెద్దలు పాల్గొన్నారు.

'కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు'

అంతర్వేది, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో కోడి పందేలు నిర్వహించేందుకు బరులు సిద్ధం చేసే ప్రాంతాల్లో పోలీసువారి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసినట్టు రెవెన్యూ, పోలీసు అధికారులు తెలిపారు. సంక్రాంతి పర్వదినాల్లో కోడిపందేలు, గుండాట, పేకాట, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించరాదని తెలిపారు. అంతర్వేది దేవస్థానం గ్రామంలో శుక్రవారం కోడిపందేలకు సిద్ధం చేసిన బరిని పరిశీలించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి


గోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

మంత్రి వాసంశెట్టి సుభాష్

కె.గంగవరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని కార్మికశాఖా మంత్రి సుభాష్ అన్నారు. శుక్రవారం మండలంలోని శివల గ్రామంలో దువ్వూరి రామకృష్ణుడు ఎంజీఎన్ ఆర్‌జీఎస్ నిధులతో నిర్మించిన గోకులం షెడ్‌ను ఆయన ప్రారంభించారు. రామకృష్ణుడు పెంచుతున్న ఆవులను షెడ్‌లో కట్టారు. అనంతరం మంత్రి ఆవులకు పూజ చేశారు. కార్యక్రమంలో యర్రపోతవరం డీసీ అధ్యక్షుడు నిడదవోలు సుబ్రహ్మణేశ్వర చౌదరి, ఎంపీపీ వంపన నాగమణి, సర్పంచ్ ఎ.సాయి, పీడీ మధుసూదన్, ఎంపీడీవో ఎన్. శ్రీనివాస రావు, ఏపీవో గణపతి, ఈసీ సాగర్, కూటమి నాయకులు మేడిశెట్టి రవికుమార్, బి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ప్రారంభం: మండలంలోని పాణింగపల్లి గ్రామంలో దాతల సాయంతో నిర్మించిన బస్‌షెల్టర్‌ను మంత్రి ప్రారంభించారు. గ్రామానికి చెందిన మేకా రాంబాబు, రాధాకృష్ణ సోదరులు దీన్ని నిర్మించగా మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొత్తపల్లి మొరార్జీ, బలుసు నాగేంద్ర, మేకా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు కూటమి ప్రభుత్వం అండ

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

అలమూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమను ప్రోత్సహించాలనే లక్ష్యంతో మినీ గోకులాలు నిర్మిస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు మండలం బడుగువానిలంకలో శుక్రవారం మినీగోకులం షెడ్లను ఎమ్మెల్యేతో పాటు, జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.రాజు, ఉపాధి ఏపీవో అరుణకుమారి, సర్పంచ్ డి.వెంకటలక్ష్మి, ఎంపీటీసీ పి.నాగలక్ష్మి, నాయకులు యేరుబండి ధర్మరాజు, పాలూరి గోవిందరావు, దూలం రాంబాబు, మెర్ల గోపాలస్వామి, ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.


గోకులం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

సురక్షితమైన మంచినీటితో సంపూర్ణ ఆరోగ్యం

ఆలమూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సురక్షితమైన మంచినీరు వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చునని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో రక్షిత మంచినీటి ట్యాంకులకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. బడుగువానిలంకలో నిర్మించనున్న ఓహెచ్ఎస్‌ఆర్ ట్యాంక్ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఇంటింటికి కుళాయిలు అందించేందుకు గ్రామాల్లో అదనపు ట్యాంకులు నిర్మించేందుకు నిధులు కేటాయింపులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పద్మ, సర్పంచ్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో నాగలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

మిగులు నిధులతో పురపాలక సంఘం అంచనా బడ్జెట్


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పురపాలక సంఘం 2025-26 ఏడాదికి రూ.71లక్షల మిగులు నిధులతో అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించింది. పురపాలక సంఘం కౌన్సిల్ బడ్జెట్ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశంలో 2024-25 సవరణ బడ్జెట్, 2025-26 అంచనా బడ్జెట్ ప్రవేశపెట్టారు. అంచనా బడ్జెట్‌లో నీటి సరఫరాకు రూ.85 లక్షలు, కాలువలకు రూ.96 లక్షలు, రోడ్లకు 1.10 కోట్లు, వీధి దీపాలకు రూ.35 లక్షలు, పార్కులు, వినోదాలకు రూ.40 లక్షలు, మార్కెట్లు, పార్కులు, భవనాలు రూ.1కోటి కేటాయింపులు జరిపారు. సమావేశంలో 3వ వార్డు కౌన్సిలరు అంకం శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం మెరుగుదలకు, వీధి దీపాలు, మౌలిక వసతుల అభివృద్ధికి కేటాయింపులు జరపాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అశీర్వప్పనాయుడు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నూతన బస్సు సర్వీస్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రయాణికుల సౌకర్యానికి అధిక ప్రాధాన్యం

రావులపాలెం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యాలకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి హైదరాబాద్ నాన్‌స్టాప్ సర్వీసులను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాసరావు, ఆర్టీసీ డీపీటీవో ఎం.శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం డిపో పారిశుధ్య కార్మికులకు చీరలు అందించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జీవీవీ రమణ, అసిస్టెంట్ మేనేజర్ అచ్యుతాంబ, నాయకులు గుత్తుల పట్టాభిరామారావు, చిలువూరి సతీష్‌రాజు, ఝెగాపుల గురవయ్యానాయుడు, జక్కంపూడి వెంకటస్వామి, పెచ్చెట్టి చిన్నారావు, సిద్ధిరెడ్డి శ్రీనివాస్, రాము, అంబటి కిషోర్, జేపీ తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందిస్తున్న సర్పంచ్ అరుణ

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ద్రాక్షారామ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు శుక్రవారం సర్పంచ్ కొత్తపల్లి అరుణ దుస్తులు పంపిణీ చేశారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి దుస్తులు, సబ్బులు, నూనె అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి పెట్టా సత్యనారాయణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు. తమ పాలకవర్గం ఎన్నికైనప్పటి నుంచి సం క్రాంతికి దుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు.

అర్తమూరులో దుస్తులు అందించిన నేతలు

మండపేట: అర్తమూరు గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య సిబ్బందికి పంచాయతీ అందించిన దుస్తులను శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గోలూగూరి అన్నపూర్ణ, ఉపసర్పంచ్ కర్రి జంబయ్యరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పి.సుబ్బారెడ్డి, గోలుగూరి భాస్కరరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


అర్తమూరులో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న నేతలు

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

నేడు ఉపాధ్యాయ సంఘం సమావేశం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘం సమావేశం 11న రామచంద్రపురం రిటైర్డు ఎంప్లాయీస్ భవనంలో జరుగుతుందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓలేటి శాస్త్రి తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.బాలాజీ, జీవీ సత్యనారాయణ తదితరులు హాజరవుతారని తెలిపారు.



మండపేటలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు. పక్క చిత్రంలో కె.గంగవరం ఆంజనేయస్వామి ఆలయంలో ఏకాహం చేస్తున్న భక్తులు


రావులపాలెం ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

భక్తి శ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

• ఉత్తరద్వార దర్శనాలు చేసుకున్న భక్తులు • హౌసింగ్ బోర్డు ఆలయంలో మంత్రి పూజలు


రామచంద్రపురంలో పూజలు చేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంతో పాటు మండలంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిపారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ముక్కోటి వేడుకల నిర్వహించారు. స్వామివారికి పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. గరుడ వాహనంపై ఉత్సవమూర్తులు అధిష్ఠించారు. ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. శాంతినగర్, మార్కెట్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ముక్కోటి వేడుకలు జరిగాయి. ఉత్తర ద్వారంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాజగోపాల్ సెంటర్‌లో ఆంజనేయస్వామి ఆలయంలో ముక్కోటి వేడుకలు జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

మంత్రి సుభాష్ పూజలు: మంత్రి సుభాష్ వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఆలయ ఈవో లక్ష్మణ్, స్థానిక నాయకులు మంత్రికి స్వాగతం పలికారు.

రామచంద్రపురం మండలంలో: రామచంద్రపురం మండలం కందులపాలెంలోనున్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి వేడుకలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వెల్లవంతెన వద్ద వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.

ఆలమూరు: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉత్తరముఖ ద్వారంలో దర్శనమిచిన స్వామివారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు బారులుతీరారు. చింతలూరు వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. గుమ్మిలేరు, నర్సిపూడి, మోదుకూరు, చొప్పెల్ల వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో సందడి నెలకొంది. మడికి, జొన్నాడ, ఆలమూరు నవజనార్దనస్వామితోపాటు సందిపూడి, పినపళ్ల, పెదపళ్ల, మూలస్థానం, పెనికేరు తదితర గ్రామాల్లోని వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

కె.గంగవరం: మండలంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పూజలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కోటిపల్లి ఛాయాసోమేశ్వరస్వామి ఆలయంలో ఉన్న సిద్ధి జనార్ధనస్వామిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. గ్రామాల్లోని రామాలయాలు, కృష్ణ మందిరాలు, వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు చేశారు. గ్రామోత్సవాలు, ఏకాహం నిర్వహించారు.

మండపేట: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంతోపాటు మండలంలో వున్న వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కేపీ రోడ్డులో వున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచే భక్తులు ఉత్తరద్వార దర్శనానికి బారులుతీరారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, పలువురు ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకున్నారు. మండపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రథంగుడిలో వున్న నవజనార్దన స్వామిని భక్తులు ఉత్తరద్వారంలో దర్శించుకున్నారు. ఆయా ఆలయాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు స్వామివారిని దర్శించుకున్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన మండపేట బంగారు వర్తక సంఘానికి చెందిన కరాచీ సెంటరులో వున్న ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ఉత్తర ద్వారంలో దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఖండవల్లి పవన్ నేతృత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని అర్తమూరు, ద్వారపూడి, కేశవరం, ఏడిద తదితర గ్రామాల్లో ముక్కోటి సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు.

జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో...

ఆత్రేయపురం: ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు జరిపారు. స్వామివారికి సహస్రనామార్చన, పంచామృతాభిషేకం, తులసీ పూజ చేశారు. అశేష భక్తజనం వైకుంఠ ద్వారం గుండా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ బీహెచ్‌వీ రమణమూర్తి ఏర్పాట్లు చేశారు. దాతలు అన్నప్రసాద ట్రస్టుకు విరాళాలు అందించారు. ఆయా గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు జరిపారు.

విజయదుర్గా పీఠంలో..

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ముక్కోటి ఏకాదశి పూజలు శుక్రవారం జరిపారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీదేవి భూదేవి సమేత విజయవేంకటేశ్వరస్వామికి అష్టోత్తర సహస్ర నామాలతో కుంకుమ పూజలు, పుష్పార్చనలు, తులసిదళ పూజలు జరిపారు. అనంతరం గాడ్ చేతుల మీదుగా శ్రీనివాసుడికి హారతులు, నీరాజన మంత్ర పుష్పాలు, మహానివేదన జరిపి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. పీఠాధిపతి గాడ్ వైకుంఠ ఏకాదశి విశిష్టతను తెలిపారు. కార్యక్రమంలో విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బి.రమ, పెదపాటి సత్య కనకదుర్గ, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆయా గ్రామాల్లో: మండలంలోని వాడవాడలా ముక్కోటి ఏకాదశిపూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాయవరం వేంకటేశ్వరస్వామి, నదురుబాద, లొల్ల, సోమేశ్వరం, పసలపూడి వెంటూరు గ్రామాల్లో రుక్మిణి సత్యభామసమేత వేణుగోపాలస్వామి, వి.సావారం గ్రామాల్లో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, వెదురుపాక జనార్ధనస్వామి ఆలయంలో అంగర సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేకువజామునుంచి ప్రత్యేక పూజలు జరిపారు. ఈసందర్భంగా వైష్ణవాలయాల్లో భక్తసంఘాల ఆధ్వర్యంలో ఏకాహ భజనలు జరిపారు.

రావులపాలెం: మండలంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా ఆలయాల్లో వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. స్థానిక వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. స్థానిక ఆంజనేయస్వామిని ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు, కూటమి నాయకులు దర్శించుకున్నారు.

కపిలేశ్వరపురం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా అంగర, కపిలేశ్వరపురం, కోరుమిల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అంగర వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ఉత్తరద్వార దర్శనంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు బాలబాలాజీ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని చందన అలంకారంలో అలంకరించారు. కల్యాణమూర్తులకు పంచామృతాభిషేకం, ముక్కోటి ఏకాదశి వార్షిక కల్యాణోత్సవం, శ్రీపుష్పోత్సవాన్ని జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

కొత్తపేట: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని కొత్తపేట పాత, కొత్త రామాలయాల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు బారులుతీరారు. భజన బృందాల భక్తి పాటలు ఆకట్టుకున్నాయి. ఆయా ఆలయాల్లో సాయంత్రం ఏకాహం నిర్వహించారు. మండలంలోని ఆయా ఆలయాల్లో ముక్కోటి ఏకాదశిని ఘనంగా జరిపారు.

నేడు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించనున్న ఎమ్మెల్యే

రాయవరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను శనివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభిస్తారని టీడీపీ నాయకుడు ఉండవిల్లి రాంబాబు తెలిపారు. శుక్రవారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ రాయవరం ఉన్నత పాఠశాలలో ఐటీసీ సౌజన్యంతో నిర్మించిన మధ్యాహ్న భోజనశాల, పాఠశాలలో సీసీ రోడ్డు, గ్రామంలో నిర్మించిన పలు సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులంతా పాల్గొనాలన్నారు.

బాక్సింగ్ పోటీలకు బాలిక ఎంపిక


సుష్మాంజలి

ఆలమూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కుమ్‌బోకటర్ బాక్సింగ్ పోటీలకు మూలస్థాన అగ్రహారానికి చెందిన పెమ్మడ బోయిన సుష్మాంజలి ఎంపికైంది. విశాఖలో జరిగిన బాక్సింగ్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించడంతో జాతీయ స్థాయి పోటీలకు బాలికను ఎంపిక చేసినట్లు కోచ్ తాతపూడి అబ్బులు తెలిపారు. విజయవాడలో జరిగే పోటీలకు బాలికతో పాటు ఆలమూరుకు చెందిన చల్లా వీరేంద్ర, పెదపళ్లకు చెందిన బుంగ అశ్విన్ అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు.

'తిరుపతి ఘటన ప్రభుత్వ వైఫల్యమే'

రావులపాలెం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన ఘటన ప్రభుత్వ వైఫల్యమేనని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి ఘటనలో మృతి చెందిన వారికి రూ.50లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. జొన్నాడ ఇసుక ర్యాంపులో జరుగుతున్న అక్రమాలను బయటపెట్టి సెల్ఫీ ఛాలెంజ్ చేస్తే ప్రస్తుత ఎమ్మెల్యే విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా నాలుగు మాటలు చెప్పి సమావేశం ముగించారన్నారు. ఇప్పటికైనా సమాధానం చెబుతారని ఎదురు చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పామర్రులో నేత్రదానం

కె.గంగవరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పామర్రు గ్రామంలో శుక్రవారం తూము వీరవెంకట సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రదానం చేయగా, కాకినాడ బాదం బాలకృష్ణ ఐబ్యాంకు ప్రతినిధులు నేత్రాలు సేకరించారు. సత్యనారాయణను, ఆయన కుటుంబ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

అలరించిన సంక్రాంతి సంబరాలు


కె.గంగవరంలో ముగ్గులు వేస్తున్న అంగర సిద్ధార్థ కళాశాల విద్యార్థినులు

కొత్తపేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కొత్తపేట విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భాష్యం, విద్యా బాలమందిర్‌లో సంక్రాంతి ముందస్తు సంబరాలు వైభవంగా జరిపారు. కళాశాలలో రంగవల్లుల పోటీలు, గొబ్బెమ్మల ఆటలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రాజు, భాష్యం ప్రిన్సిపాల్ ఎం.లోకేశ్వరరావు, విద్యాబాలమందిర్ డైరెక్టర్ అనురాధ ఆధ్వర్యంలో వేడుకలు జరపారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో అలరించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని శ్రీ సిద్ధార్థ కళాశాలలో విద్యార్థులు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అలరించాయి. విద్యార్థినులు వినూత్నమైన ముగ్గులను వేశారు. భోగి మంటలు, హరిదాసు కీర్తనలతో సందడి చేశారు. కళాశాల నిర్వాహకులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. కళాశాల ప్రాంగణం సంక్రాంతి సంబరాలతో సందడిగా మారింది. కళాశాల డైరెక్టర్ వాకా పరమేశ్వర, చైర్మన్ డాక్టర్ దివ్యశేఖర్, కరస్పాండెంట్ వి.రాజా, ప్రిన్సిపల్ పి.రమణ మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలోని పామర్రు గ్రామంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక టీడీపీ నాయకులు వీటిని ఏర్పాటు చేశారు. రావిచెట్టు సెంటర్ వీధిలో పోటీలు జరిపారు. ఈ పోటీల్లో పామర్రు జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు గ్రామంలోని మహిళలు ముగ్గులు వేశారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవరపల్లి వెంకటేశ్వరరావు, మరివాడ సూరిబాబు, దేవరపల్లి బుల్లి, మార్ని శ్రీధర్, జూనియర్ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆత్రేయపురం మహాత్మాగాంధీ హైస్కూల్‌లో భోగి మంటలు వేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: ఆత్రేయపురం మహాత్మా గాంధీ ఎయిడెడ్ హైస్కూల్, జూనియర్ కాలేజీ విద్యార్థులు శుక్రవారం సంక్రాంతి సంబరాలు జరిపారు. విద్యార్థినీలు సంప్రదాయ దుస్తులు ధరించారు. భోగి మంటలు, గొబ్బెమ్మలతో వారు సందడి చేశారు. సెక్రటరీ కరస్పాండెంట్ పీఎస్ రాజు, పాలకవర్గ సభ్యుడు ముళ్ళపూడి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు.


కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాల్లో సందడి చేస్తున్న దృశ్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురం పట్టణంలోని పలు విద్యా సంస్థల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు జరిపారు. మోడరన్ డిగ్రీ కళాశాలలో ఆవరణలో రంగవల్లుల పోటీలు జరిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టరు ఆర్.ఉమాదేవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, హెచ్ఎం చిట్టిబాబు, డిగ్రీ అకడమిక్ డైరెక్టరు సాయిరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

వికాస్ విద్యా సంస్థల్లో: వికాస్ విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు, విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత ఏఈ కడలి రామకృష్ణ దంపతులు వ్యవహరించారు. విజేతలకు కళాశాల కరస్పాండెంట్ వాసంశెట్టి వెంకటరమణ, ప్రిన్సిపాల్ ఝాన్సీలక్ష్మీ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దూర ప్రాంతాలకు వెళ్లే వాళ్లు జాగ్రత్తలు పాటించాలి

కె.గంగవరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవులను పురస్కరించుకుని దూర ప్రాంతాలకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పామర్రు ఎస్ఐ ఎస్‌కె జానీ బాషా అన్నారు. సంక్రాంతి పండుగల నేపథ్యంలో కుటుంబ సమేతంగా వేరే ప్రాంతాలకు వెళ్లేవారు వెండి, బంగారు వస్తువులు, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. ఇళ్లకు తాళం వేసి వెళ్లే వారు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇస్తే గస్తీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. దొంగతనాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రామచంద్రపురం సీఐగా వెంకటనారాయణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం సీఐగా ఎం.వెంకటనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న ఆయన్ను రామచంద్రపురం సీఐగా నియమించారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడతానని సీఐ తెలిపారు.


సీఐ వెంకటనారాయణ

ప్రభలు వెళ్లే రహదారికి మరమ్మతులు

అంబాజీపేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ముక్కామల లాకుల వద్ద ప్రభలు వెళ్లే రహదారికి మరమ్మతు పనులు చేపట్టారు. గత ఏడాది డిసెంబరు 31న ప్రభలు వెళ్లే రహదారి అధ్వానం అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ అధికారులు సీసీ రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టారు. గోతుల్లో గ్రావెల్‌ను వేసి మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో ఆ రహదారిపై వెళ్లే నేదునూరు, ముక్కామల, వక్కలంక ప్రజలతో పాటు ప్రభల నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

జగ్గన్నతోట ప్రభల ఉత్సవం.. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

సంక్రాంతి సందర్భంగా ఈనెల 15వ తేదీన అంబాజీపేట మండలం జగ్గన్నతోటలో జరిగే ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవానికి సంబంధించి ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీఐ రుద్రరాజు భీమరాజు తెలిపారు. జగ్గన్నతోట ప్రభల తీర్థం జరిగే ప్రదేశాన్ని, ప్రభలు వచ్చే రహదారులను ఆయన ఎస్ఐ కె.చిరంజీవితో కలిసి పరిశీలించారు. సీఐ భీమరాజు మాట్లాడుతూ ప్రతి ప్రభ వద్ద బందోబస్తు ఏర్పాటుచేసి అల్లర్లు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభల తీర్థాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు ఆయా ఉత్సవ కమిటీలు సహకరించాలని సూచించారు.

లేబర్ ఆఫీసర్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

కె.గంగవరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన 2025 డైరీని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజమండ్రి, మండపేట సర్కిల్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె.శివనాగేశ్వరరావు, ఎస్‌కె.జలీనా, విజయప్రకాష్, స్నేహరెడ్డి, లలిత కుమారి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కొండమూరి సేవలు ప్రశంసనీయం

కపిలేశ్వరపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజల ప్రాణదాత డాక్టర్ కొండమూరి నరసింహమూర్తి సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలన్నారు. శుక్రవారం మండలంలోని అంగర అశిరాంబ ఆలయం వద్ద పీఎంపీ వైద్యులు గంగుమళ్ళ రాంబాబు ఆధ్వర్యంలో నిర్మించిన నరసింహమూర్తి విగ్రహాన్ని ఆయన తనయుడు సత్యనారాయణ, మరకా రాంబాబు ఆవిష్కరించారు. అనంతరం కపిలేశ్వరపురం గ్రామంలో ఆయన స్వగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్య వృత్తిలో ఉన్న పీఎంపీలు ఆయన కుటుంబ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో కొండమూరి మనువడు డాక్టర్ రఘువీర్ ఖాన్, మనువరాలు డాక్టర్ సత్యనిషాంత్, అంగర ఎంపీటీసీ అడ్డాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.